Dawat-e-Islami Kya Hai ?
(Telugu)

ధర్మసంస్థాపనం

అనువాదం

అబ్బాదుల్లా బి.ఏ.

కార్యనిర్వాహక శాఖ

జమాఅతె ఇస్లామీ హింద్

ఆంధ్రప్రదేశ్ మండలం

22-8-499 పురానీ హవేలీ

హైదరాబాద్-500 002

ఆంధ్రప్రదేశ్

విషయ సూచిక

1.	మౌలిక విశ్వాసం	5
2.	ఇస్లాం	13
3.	ముస్లిం	20
4.	ముస్లింల బాధ్యత	29
5.	ఇఖామతే దీన్ (ధర్మసంస్థాపన)	38
6.	జమాఅతె ఇస్లామీ హింద్	45

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడయిన అల్లాహ్ పేరుతో

1. మౌలిక విశ్వాసం

లా ఇలాహ ఇల్లల్లాహు ముహమ్మదుర్రసూలుల్లాహ్ అను కలిమాను మనస్ఫూర్తిగా అంగీకరించే ప్రతి వ్యక్తీ ముస్లిం. ఈ విధంగా అంగీకరించని వ్యక్తి ఇస్లాం పరిధిలోకిరాడు. మొదటి వ్యక్తి అల్లాహ్ ప్రేమకు పాత్రుడవుతాడు. ఆయన కరుణకు అర్హుడవుతాడు. ఇంకా, ఇతని కోసం స్వర్గద్వారాలు తెరువబడతాయ్. రెండవ వ్యక్తి అల్లాహ్ ఆగ్రహానికి గురవుతాడు. పరలోక శాశ్వత జీవితంలో నరకమే అతని నివాసం అవుతుంది. దివ్య ఖుర్ఆన్ సూత్రప్రాయంగా తెలిపిన విషయమిదే.

ఇక యోచింపదగు విషయమేమంటే మానవులంతా అల్లాహ్‌కు దాసులు; ఆయనే అందరినీ సృష్టించాడు, అందరినీ పోషిస్తున్నాడు కూడా. అయితే కేవలం **లా ఇలాహ ఇల్లల్లాహు ముహమ్మదుర్ రసూలుల్లాహ్** అనే రెండు వాక్యాలను స్వీకరించటమో లేక నిరాకరించడమో జరగడం వల్ల మనిషి, మనిషి మధ్య ఇంత భేదం కలగడానికి కారణమేమిటి? మానవాళిని ఇలా రెండు విభిన్న వర్గాలుగా విభజించే ఈ రెండు వాక్యాల్లో ఉన్న అసలు విషయం ఏమిటి?

ఈ రెండు వాక్యాల్లోని పదజాలాన్ని కేవలం నోటితో పలకడంలోనే ఏదో మంత్రశక్తి ఉండి మనిషి మనిషి మధ్య ఇంత గొప్పభేదం ఏర్పడుతుందని ఎవరూ అంగీకరించరు. కాని ఈ రెండు వాక్యాల్లో సూచింపబడిన విషయాల్ని

అంగీకరించటం వల్లనో లేక దాన్ని నిరాకరించడంవల్లనో ఈ భేదం కలుగుతుంది అనే విషయం విశదమవుతూనే ఉంది. ఏ వ్యక్తి ఈ రెండు వాక్యాలను చిత్తశుద్ధితో అంగీకరిస్తాడో ఆ వ్యక్తి నిజానికి అతి ముఖ్యమైన రెండు మౌలిక విషయాల్ని అంగీకరించి, అవి తన హృదయంలో కూడా ఉన్నాయని ఒప్పుకున్నట్లే. మనిషి హృదయంలో ఒక విషయానికి స్థానం ఏర్పడితే దానికనుగుణంగానే ఆ వ్యక్తి స్వరూప స్వభావాలు రూపొందుతాయి అనే సత్యాన్ని ఎవరూ కాదనలేరు. ఉదాహరణకు ధన వ్యామోహం కల ఒక వ్యక్తిని తీసుకోండి. అతని పరిస్థితి ఎలా ఉంటుందంటే అతని సంభాషణ, అతని వ్యవహారాలు తోటి మనుషులతో అతని సంబంధాలు ఇవన్నీ అతడు నిత్యం డబ్బు దస్కాలనే కాంక్షిస్తూ ఉంటాడని చాటుతుంటాయి. అతని దృష్టిలో డబ్బుకు ఉన్న విలువ మరే ఇతర వస్తువుకూ ఉండదు. ఉదయాన్నుంచి సాయంత్రం వరకు అతడు ఏ విషయాల కొరకు కృషి చేస్తాడో ఏ విధంగా సమయాన్ని వినియోగిస్తాడో, ఏ పనుల్లో ఆసక్తి చూపిస్తాడో, వీటన్నిటి వల్ల అతడు కేవలం ధనాన్నే ఆశిస్తున్నాడు అనే విషయం స్పష్టమవుతుంది. ఏ సంబంధాలయినా సరే, బంధుత్వమయినా స్నేహమయినా, అతనికి ధనం కంటే ప్రియప్రదం కావు. ఇదే విధంగా దేశభక్తిలో గుడ్డిగా మునిగిపోయిన వ్యక్తుల్నీ లేదా హోదాలను అధికారాన్ని పొందడమే లక్ష్యంగా పెట్టుకున్న వ్యక్తుల్ని లేదా శాస్త్రీయ రంగంలో మహాకార్యాలను సాధించడంపై తమ దృష్టిని లగ్నం చేసుకున్న వ్యక్తుల్నీ చూడండి- వారు తమ జీవితాన్ని తమ అభిరుచులకనుగుణంగా మలచుకుంటారు. వారి ప్రతి కదలిక, నిద్రపోయినా మేల్కొన్నా తాము ఎన్నుకున్న లక్ష్యానికి అంకితమయి ఉంటుంది.

ఏ రెండు వాక్యాలను స్వీకరించడం వల్ల తిరస్కారి మోమిన్‌గా, అపవిత్రుడు పవిత్రుడుగా, నరక పాత్రుడు స్వర్గ పాత్రుడుగా మారిపోతాడో ఆ రెండు వాక్యాల అర్థాన్నీ వాటిలో చెప్పబడిన రెండు ముఖ్య విషయాల్నీ

తెలుసుకుందాము. ఈ వాక్యాల ద్వారా ఒక వ్యక్తి రెండు విషయాలను గురించి ప్రమాణం చేస్తున్నాడు. మొదటిది: **"అల్లాహ్ తప్ప మరెవ్వరూ నా ఆరాధ్య దైవం కాదు"** రెండవది: **"హజ్రత్ ముహమ్మద్ (సఅసం) అల్లాహ్ ప్రవక్త."** అల్లాహ తప్ప ఇతరుల్ని నా దైవంగా అంగీకరించనని ఎప్పుడయితే ఒక వ్యక్తి అంటాడో దాని భావం ఏమంటే సృష్టికర్త కేవలం అల్లాహ మాత్రమే; ఆయన తప్ప మరెవ్వరూ ఏ వస్తువునూ సృష్టించలేదు సృష్టించజాలరు కూడా; ఆయనే అందరికీ యజమాని, పోషణకర్త, సర్వాధికారి; ఆయన తప్ప మరొక యజమాని కాని, సర్వాధికారి కాని, పోషణ కర్త కానీ లేడు; ప్రార్థనలను ఆలకించేవారు గాని, వాటిని అనుగ్రహించే వారు కాని, మరొకరు లేరు; మనిషి చేసే దాస్యానికి అర్హుడయిన వాడు అల్లాహ తప్ప మరొకడు లేడు; ఈ ప్రపంచం స్వతహాగా ఏర్పడలేదు. దీన్ని సృష్టించిన వారు అనేకులు కూడా కారు. దీన్ని సృష్టించినవాడు కేవలం అల్లాహ ఒక్కడే; ఆయన విశ్వమంతటికీ యజమాని. ఇక్కడ ఉన్నదంతా ఆయనదే; జనన మరణాలన్నీ ఆయన అధీనంలోనే ఉన్నాయి; కష్టసుఖాలు కలిగేది ఆయన వల్లనే, ఆయన ఇవ్వాలనుకుంటే ఎవ్వరూ అడ్డగించలేరు; ఇవ్వకపోతే ఎవ్వరూ ఇప్పించలేరు; మానవుడు ఆయనకే భయపడాలి, ఆయన అప్రసన్నతకే దూరంగా ఉండాలి; ఆయన్నే చేయి చాచి అర్థించాలి; ఆయన సమక్షంలోనే వినమ్రులు కావాలి; ఆయనకే దాస్యం చెయ్యాలి-ఎందుకంటే మనిషి ఆయనకు తప్ప మరెవ్వరికీ దాసుడు కాడు; ఆయన ఒక్కడు తప్ప ఎవ్వరూ యజమాని, స్వామి కారు, అందువల్ల కేవలం ఆయన ఆజ్ఞల్నే పాలించడం ఆయన చేసిన చట్టాలనే అనుసరించడం మానవుని అసలు కర్తవ్యం.

ఈ స్వీకారం ఎంత మహోన్నతమయిందో ఈ ప్రమాణం హృదయ పూర్వకంగా చేసిన వ్యక్తి జీవితంపై ఎట్టి ప్రభావం పడుతుందో మీరే ఆలోచిం

చండి. అల్లాహ్‌ను తప్ప ఇంకెవ్వరినీ దైవంగా, పూజ్యునిగా అంగీకరించనని బాగా ఆలోచించి అర్థం చేసుకుని ప్రమాణం చేసిన వ్యక్తి అల్లాహ్‌ను వదలి మరొకడు తన నిజమయిన ప్రభువనీ, యజమాని అనీ, అతడు తన కష్టాల్ని కడతేర్చగలడనీ, తన అవసరాలను తీర్చగలడనీ ఏ విధంగా భావిస్తాడు? ఇప్పుడు ఆ వ్యక్తి హృదయంలో అల్లాహ్ భయం తప్ప ఇంకొకరి భయానికి స్థానమే ఉండదు. ఆ వ్యక్తి మరొకరిపై భరోసా చేయలేడు; మరొకరిపై ఆశలు పెంచుకోడు కూడా. ఎందుకంటే శక్తి అధికారం కేవలం అల్లాహ్‌కే ఉన్నాయనీ, సర్వాధికారాలూ ఆయన అధీనంలోనే ఉన్నాయనీ ప్రమాణంచేశాడు. అందుచేత మరెవరయినా లాభనష్టాలు కలిగించగలరని అతడు భావించగలడా?

అల్లాహ్ తప్ప యజమాని, దైవం పూజనీయుడు ఇంకొకడులేడన్న దృఢ విశ్వాసం మనిషి హృదయంలో నాటుకుంటే ఆ మనిషి అల్లాహ్‌ను తప్ప మరొకరిని పూజించడం కానీ, మొక్కుబడులు, నైవేద్యాలు సమర్పించడం కానీ, చేతులు కట్టుకుని మరొకరి ముందు నిలవడం కానీ, తలవంచడం కానీ, మరొకరికి సాష్టాంగపడటం కాని, బహు దైవారాధకులు తమ దేవతల విగ్రహాల ఎదుట కనబరచే వినయం పూజాభావాలు దైవేతరుల ఎడల కనబరచడం కాని జరగటానికి వీలులేదు. ఈ ప్రమాణం చేసి దాని పట్ల దృఢ విశ్వాసం కలిగి ఉన్న వ్యక్తి అల్లాహ్‌ను తప్ప మరొకరిని ప్రార్థించడు, మరొకరి శరణు వేడడు, మరొకరిని సహాయం చెయ్యమని అర్థించడు– ఎందుకంటే అతని దృష్టిలో అల్లాహ్ తప్ప మరొకరి అధికారం చెలామణి కాదు; మరొకరు ప్రార్థనల నాలకించేవారు, శరణు ఇచ్చి కాపాడేవారు ఆపదలందు ఆదుకునేవారు లేరు *

---

* ఒక మనిషి మరో మనిషికి సహాయం చేయడం, కష్టాల్లో ఆదుకోవడం సానుభూతి కనబరచడం పూర్తిగా వేరు విషయం. ఇక్కడ ప్రస్తావించబడిన సహాయం ప్రాపంచిక సాధన సూత్రాలకు అతీతమయిన అగోచర శక్తి చేసే సహాయం మాత్రమే.

ఈ ప్రమాణం, దృఢ విశ్వాసాలవల్ల తప్పనిసరిగా ఉత్పన్నమయ్యే పరిణామం ఏమంటే ఒక వ్యక్తి అల్లాహ్‌ను తప్ప మరొకణ్ణి ఈ విశ్వానికి యజమానిగా భావించరాదు. ఆయనకు తప్ప ఇంకొకరికిక్కూడా ఇష్టానుసారం ఆజ్ఞాపించే, నిషేధించే, స్వయంగా చట్టాలు నిర్మించే హక్కు ఉందని ఒప్పుకోకూడదు. ఎందుకంటే విశ్వానికి స్వామి అల్లాహ్ కనుక ఆయన తన దాసుల్ని తన ఇచ్ఛ ప్రకారం ఆజ్ఞాపించడానికి వారికోసం చట్టాలు నిర్మించడానికి ఆయనకే హక్కు ఉంది. మానవులకు సరయిన మార్గం ఏదంటే, కేవలం నిజమయిన యజమాని ఆజ్ఞల్నే, చట్టాలనే పాటించడం, అల్లాహ్ ఆజ్ఞల్ని ఖాతరుచెయ్యకుండా స్వతంత్రంగా చేయబడ్డ చట్టాలు సరయినవని భావించకుండా ఉండటం.

ఇంతేకాదు, **"లా ఇలాహ ఇల్లల్లాహ్"** సద్వచనాన్ని మనస్ఫూర్తిగా అంగీకరించిన పిమ్మట మానవుడు తన ఇష్టానుసారంగా ప్రవర్తించలేడు; తనకు నచ్చినట్లు ప్రవర్తిస్తూ విశృంఖలంగా తిరగటానికి వీలుపడదు. అతను తన కోరికలను, ఇష్టా ఇష్టాలను అల్లాహ్ అభీష్టానికి అనుగుణంగా మార్చుకోవాలి. మనిషి ప్రతి వస్తువు తనది కాదని, తుదకు తన ప్రాణం కూడా నిజానికి తనది కాదని, అది కూడా అల్లాహ్ సొత్తే అని; కేవలం అల్లాహ్ మాత్రమే తనలో ఉన్న సర్వశక్తి సామర్థ్యాలకు అసలు యజమాని అని, ఈ వస్తువులన్నీ అమానతుగా తన అధీనంలో ఉంచబడ్డాయి అని అంగీకరించినప్పుడు వాటిని వాటి యజమాని అయిన అల్లాహ్ ఇష్టానికి వ్యతిరేకంగా అతడు ఉపయోగించలేడు! శక్తులు, వస్తువులు అన్నీ దైవాభీష్టానుసారం ఉపయోగించేందుకే అతని అధీనంలో ఇవ్వబడ్డాయి. ఒక దినం అతడు తన ప్రభువు ముందు హాజరు కావలసి వుంది. అక్కడ, దైవం అమానతుగా అనుగ్రహించిన వస్తువులను తాను ఏ విధంగా ఉపయోగించాడో జవాబు చెప్పుకోవలసి వుంది. అమానతుగా

ఇవ్వబడిన వస్తువులను తన అభీష్టానుసారంగా కాని లేక తోటి మానవుల అభీష్టానుసారంగా కాని ఉపయోగించలేదు అని అక్కడ చెప్పుకోవలసి ఉంది. ఒకవేళ ఆ విధంగా చేసి వుంటే అతడు తన ప్రభువు సమక్షంలో అవిధేయుడుగా నిలుస్తాడు. కఠిన శిక్షకు గురవుతాడు.

లా ఇలాహ ఇల్లల్లాహ్ అనే వచనాన్ని హృదయ పూర్వకంగా అంగీకరించిన పిమ్మట అల్లాహ్‌కు నచ్చని ఏ విషయమూ మనకు నచ్చదు, అల్లాహ్‌కు నచ్చిన ఏ విషయాన్నీ మనం త్రోసిపుచ్చలేము, మనం చేసే కార్యకలాపాలన్నీ కేవలం మనం అల్లాహ్‌కు విధేయులమయి ఉండగలందులకు, ఆయన ప్రీతిని పొందగలగడానికే అంకితమవ్వాలి. దాని కొరకు మనం మన జీవిత వ్యవహారాల్లో ఒకే ఒక్కమాటపై దృష్టిని లగ్నం చేసుకోవాలి. అంటే అల్లాహ్ ఆదేశమేమిటో తెలుసుకోవటం నైతికతలో, ప్రవర్తనలో, ఆచార సాంప్రదాయాలలో, అన్న పానీయాల విషయంలో, వృత్తివ్యాపారాల్లో, సంపాదనా వ్యయం విషయాల్లో, చట్టాల నిర్మాణాల్లో, ప్రభుత్వ నిర్వహణలో ఒక్కటేమిటి జీవితం లోని అన్ని విషయాలలో మనం అల్లాహ్ చూపిన మార్గంపైనే నడచుకోవలసి ఉంటుంది. అల్లాహ్ ప్రసాదించిన చట్టాన్నే సవ్యమయినదిగా, అనుసరణీయ మయినదిగా నమ్మాలి. దానికి భిన్నమయిన దాన్ని తప్పయినదిగా భావించడం, ప్రకటించడం, ఇంకా, రద్దుచేయ దగ్గదిగా నిర్ణయించడం దాన్ని జీవిత రంగం నుండి తొలగించడానికి ప్రయత్నించడం అత్యంతావశ్యకం.

లా ఇలాహ ఇల్లల్లాహ్‌ను అంగీకరించిన పిదప మనం ప్రమాణం చేసే రెండో మాటః **ముహమ్మదుర్ రసూలుల్లాహ్** అనేది. '**ముహమ్మద్ (సఅసం) అల్లాహ్ ప్రవక్త**' అని ఈ వాక్యానికి అర్థం. ఆది నుండి విభిన్నదేశాలలో విభిన్న జాతులలో ప్రభవిస్తూ అల్లాహ్ దాసులకు ఆయన 'దీన్'ని (ధర్మాన్ని) అందిస్తూ వచ్చిన అనేక ప్రవక్తల పరంపరలో ముహమ్మద్ (సఅసం) చివరి

ప్రవక్త. ఈ ప్రవక్త ద్వారా వచ్చిన ధర్మం సంపూర్ణం, సమగ్రం, అంతిమం, సార్వజనీనం మరియు సార్వకాలికం. ఈ 'దీన్' లేక దైవోపదేశం, మనకు ఎంత అవసరమో తెలిసిన విషయమే. సమస్త మానవజాతికి సృష్టికర్త, యజమాని, ప్రభువు, అధికారి మరియు ఆరాధ్యుడు కేవలం అల్లాహ మాత్రమే అయినప్పుడు ఆయన ఆజ్ఞల్ని, ఆయన హితోపదేశాల్ని సంపూర్ణంగా తెలుసుకోవలసిన అవసరం ఎంతో ఉంది. తమ దైవం, ప్రభువు తమ నుండి కోరేదేమిటో దాసులకు తెలియాలి. వారు ఏది చేయాలి? ఏది చేయకూడదు? ఏ పనుల వల్ల ఆయన సంతోషపడతాడు. ఏ పనులంటే ఆయనకు నచ్చవు? ఆయన ప్రసన్నత పొందాలంటే వారు అవలంబించవలసిన మార్గమేది? పరలోకాన ఆయన క్షమాభిక్షను పొందాలంటే, ఆయన కృపానుగ్రహాలకు అర్హులు కావాలంటే, ఆయన వరాలను పొందాలంటే ఏ మార్గం పాటించాలి? ఆయన అప్రసన్నత నుండి ఆగ్రహాన్నుండి రక్షించుకోవాలంటే వారు విడనాడవలసిన మార్గాలేవి? అనే విషయాలను గురించి అల్లాహ దాసులు తెలుసుకోవలసివుంది. ఈ అవసరాన్ని తీర్చేందుకే అల్లాహ ఇతర ప్రవక్తల వలే హజ్రత్ ముహమ్మద్ (సఅసం) ను తన ప్రవక్తగా నియమించాడు. ఆయన ద్వారా తన అభీష్టాన్ని మనకు తెలియపరిచాడు. దీనికిగాను ఖుర్ఆన్ మన వద్దకు పంపాడు. ఈ గ్రంథాన్ని మనకు అందించిన ప్రవక్త ముహమ్మద్(సఅసం) దాని కనుగుణంగా జీవితం గడిపి, అల్లాహ దాసులు ఏ విధంగా తమ జీవితం గడపాలో తెలిపారు. కనుక హజ్రత్ ముహమ్మద్(సఅసం)ను అల్లాహ ప్రవక్తగా అంగీకరించడమంటే ఆయన మనకు తెలిపిన ప్రతి మాటను అనుసరించాలి అని అర్థం. దైవ ప్రవక్త మనకు ఇచ్చిన చట్టాన్నే పాటించాలి. ఏ విధంగా ఆయన అల్లాహ దాస్యం చెయ్యమని తెలిపారో అదే విధంగా మనం కూడా అల్లాహ దాస్యం చెయ్యాలి.

ఇస్లాంలో ప్రవేశించిన పిమ్మట మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను

అనుసరించడం పట్ల తిరస్కారం చూపడం లేదా ఆయన ఇచ్చిన ఆదేశాల్ని సత్యమయినవిగా అంగీకరించకపోవడం విశ్వాసం కాజాలదు. అదే ధర్మవిరుద్ధ మయిన వైఖరి. మహా ప్రవక్త ఇచ్చిన ఆజ్ఞ ఇదీ అని మనకు తెలిసినప్పుడు దాన్ని శిరసావహించడం మన విధి. అలాగే ఒక విషయాన్ని మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) నిషేధించారని మనకు తెలిసినప్పుడు మనం దానికి దూరంగా ఉండాలి. ఏ విషయమైనా సరే అది మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) తెచ్చిన ధర్మం, ఆయన సున్నత్‌ల(సంప్రదాయం) ప్రకారం ఉందని తెలియనంతవరకు ఆ విషయాన్ని మనం స్వీకరించరాదు. ఇంకా, ఆ రెంటికి వ్యతిరేకంగా ఉండే ప్రతి మాటను త్రోసిపుచ్చాలి.

ఇదే **లా ఇలాహ ఇల్లల్లాహు ముహమ్మదుర్రసూలుల్లాహ్** అనే కలిమాకు అర్థం. దీన్ని విశ్వసించినందువల్ల మనపై పడే బాధ్యతలు ఇవే. ఈ కలిమాను హృదయపూర్వకంగా స్వీకరించే వ్యక్తి అల్లాహ్‌కు పరిపూర్ణ దాసుడు, మహా ప్రవక్త ముహమ్మద్(సఅసం)కు విశ్వాస పాత్రుడయిన అనుచరుడు అవుతాడు. అతని పూర్తి జీవితం అల్లాహ్ అభీష్టానికి ఆయన ధర్మానికి అనుగుణంగా రూపొందుతుంది. కాని ఈ కలిమాను విశ్వసించని వ్యక్తి అల్లాహ్ దృష్టిలో ద్రోహిగా పరిగణింపబడతాడు. ప్రపంచంలో ఈ రెండు వర్గాలకు చెందిన మానవుల మార్గాలు వేరు వేరుగా వుంటాయి. ఈ కారణం వల్లనే పరలోకంలో వారికి లభించే ఫలితాలు కూడా వేర్వేరుగానే ఉంటాయి. మొదటి వ్యక్తి అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు, ఆయన దీన్‌కు విశ్వాస పాత్రుడయినందువల్ల ఇహ పరాల్లో ఆయన కరుణకు, క్షమాభిక్షకు అర్హుడవుతాడు. రెండవ వ్యక్తి స్వామి ద్రోహానికి, తిరస్కారానికి పాల్పడటం వల్ల అల్లాహ్ ఆగ్రహానికి గురవుతాడు.

☆ ☆ ☆

2. ఇస్లాం

ఇస్లాం ప్రతిపాదించే మౌలిక విశ్వాసాన్ని మీరు అర్థం చేసుకున్నారు. ఒక వ్యక్తి పేరు ముస్లిం పేర్లను పోలి ఉన్నప్పటికీ, అతడు ముస్లింల ఇంటి యందే పుట్టినప్పటికీ ఈ విశ్వాసం ఆ వ్యక్తి మనసులో చోటుచేసుకోనంతవరకు, దీన్ని మనఃపూర్వకంగా అతడు అంగీకరించనంత వరకు ఆ వ్యక్తి ముస్లిం కాజాలడు అనే విషయాన్ని కూడా మీరు గుర్తించారు. ఒక వ్యక్తి ముస్లిం అవటానికి **"లా ఇలాహ ఇల్లల్లాహు ముహమ్మదుర్ రసూలుల్లాహ్"** అనే కలిమాను చిత్తశుద్ధితో విశ్వసించాలి. ఇక, ఇస్లాం అంటే ఏమిటో విశదంగా తెలుసుకుందాం. "ఇస్లాం" అంటే అల్లాహ్ పట్ల పూర్తి విధేయత కలిగి ఉండడం. "కుఫ్ర్" అంటే దైవ తిరస్కారం, కృతఘ్నత, అవిధేయత అని అర్థం. ఇస్లాంను స్వీకరించే వ్యక్తి, దాన్ని నిరాకరించే వ్యక్తి ఇరువురూ మానవులే, వారిద్దరూ దేవునిచే సృష్టింపబడినవారే, ఆయనకు దాసులే. కాని మొదటి వ్యక్తి తన ప్రభువును, తనకు మేలుచేసిన వాణ్ణి గుర్తిస్తాడు. ఆయన్నే తన స్వామిగా సర్వాధికారిగా అంగీకరిస్తాడు. ఆయన ఆజ్ఞల్నే పాలిస్తాడు. ఆయన ఇచ్చిన అనుగ్రహాలకు మనసారా కృతజ్ఞత తెలుపుకుంటాడు. అందుచేత అతడు ముస్లిం అయ్యాడు. అతడంటే అల్లాహ్‌కు ఎంతో సంతోషం. మరణానంతరం స్వర్గం అతని నివాసమవుతుంది. రెండవ వ్యక్తి తన ప్రభువును గుర్తించడం లేదు. ఒకవేళ గుర్తించినా తప్పుడు రూపంలో గుర్తిస్తున్నాడు. ఆయనతో పాటు అన్యుల్ని దైవత్వంలో ఆయనకు సాటిగా భావిస్తున్నాడు. ఆయన ఆజ్ఞల్ని కాదని తన ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నాడు. తనకు పోలిన ఇతర మానవుల దాస్యాన్ని

స్వీకరిస్తున్నాడు. తన నిజమయిన ప్రభువు విధేయతను నిరాకరిస్తున్నాడు. ఆయన అనుగ్రహాలను ఆయన ఇష్టానికి వ్యతిరేకంగా ఉపయోగిస్తూ కృతఘ్నుడవుతున్నాడు. అందుకే అతడు తిరస్కారి అనబడుతాడు. అల్లాహ్ అయిష్టానికి గురవుతాడు. మరణానంతరం నరకం అతని నివాసం అవుతుంది. ఈ విషయమే ఒక ముస్లింను తిరస్కారి నుండి వేరుచేస్తుంది.

ఇక గమనించవలసిన విషయమేమంటే ఏ మనిషయినా తనను తాను ముస్లిం అంటూ, ముస్లిం అని ఎవరిని అంటారో, అతడి ప్రభువు అతని నుండి కోరేదేమిటో, ఆయన అభీష్టం ఏమిటో, అతనికి ఏమాత్రం తెలియకపోతే, తన స్వామి ఇచ్చిన ఆజ్ఞలేమిటో, ముస్లిం అయినందువల్ల అతడు ఏమి చేయాలో, ఏమి చేయకూడదో అనే విషయాల పట్ల అతనికి ఏ మాత్రం శ్రద్ధలేకపోతే, కేవలం వస్త్రధారణ, అన్నపానీయాలలో వ్యత్యాసం ఉన్నంత మాత్రాన అతడు అల్లాహ్ విధేయుడుగా పరిగణింపబడతాడా? అతడంటే అల్లాహ్ ఇష్టపడతాడా? పరలోకంలో అతన్ని తన అనుగ్రహానికి అర్హుడంటాడా? ఆ విధంగా ఎన్నటికీ కాజాలదని మీ ఆంతర్యమే సాక్ష్యమిస్తుంది. అసలు విషయం కూడా ఇదే. ఒక వ్యక్తి ఒక ప్రత్యేక కులానికో, వంశానికో, తెగకో చెందిన వాడవటం చేత అల్లాహ్ దృష్టిలో శ్రేష్టుడు కాజాలడు. అల్లాహ్‌ను బాగుగా గుర్తించి ఆయన ఆగ్రహానికి గురికాకుండా జాగ్రత్తపడేవాడు, ఆయన ఆజ్ఞల్ని అనుసరించడానికి మనసారా ప్రయత్నించేవాడు ఏ వంశంలో పుట్టినప్పటికి అల్లాహ్ దృష్టిలో అతడే శ్రేష్ఠుడు. పుట్టుకను బట్టి ఒక వ్యక్తి నీచుడవుతాడు అనే విషయానికి ఇస్లాంలో ఏ మాత్రం తావులేదు. దైవాన్ని నమ్మని వారు, ఆయన ఆజ్ఞల్ని తిరస్కరించేవారు, ఇంకా ఆయన చూపిన మార్గాన్ని వదలి ఇతర మార్గాల ననుసరించేవారు మాత్రమే ఇస్లాం దృష్టిలో నీచులు.

నేటి ముస్లింల స్థితి ఎలా వుంది? వారి సంఖ్యా బలమయితే అధికంగానే

ఉంది. ప్రపంచంలోని ఎన్నో దేశాలలో వారి ప్రభుత్వాలు కూడా నెలకొన్నాయి. కాని వారికి ఏ గౌరవ స్థానము ఉండాలో అది లేదు. వారి స్థానం ప్రపంచంలోని ఇతర జాతుల, సమాజాల కంటే ఉన్నతంగా ఉండవలసింది. ఎందుకంటే సమస్తశక్తుల సర్వాధికారాలున్న విశ్వ ప్రభువును వారు విశ్వసిస్తున్నారు. ఆయన సెలవిచ్చింది కూడా ఇదేః

"మీరు విశ్వాసులే అయితే మీరే అందరిపై ఆధిక్యత అధికారాలు కలవారవుతారు."

కాని మనపరిస్థితి చూస్తే దానికి పూర్తిగా భిన్నంగా ఉంది. కారణం ఏమిటో ఆలోచించండి. దైవ సమక్షంలో తప్ప మరెక్కడా తలవంచకూడని ముస్లింలు ఈనాడు తమలాంటి మానవుల ముందు తలవంచుతున్నారు. దైవభీతి తప్ప మరేభయమూ ఉండకూడని ముస్లింల హృదయాల్లో ఎన్నో భయాలు చోటు చేసుకున్నాయి. ప్రభువు ప్రసాదించిన అనుగ్రహాలను తన ఇష్టానుసారం ఉపయోగించకుండా జాగ్రత్తపడవలసిన ముస్లింలు వాటిని ప్రభువు ఇష్టానికి వ్యతిరేకంగా ఉపయోగించడానికి ఏ మాత్రం జంకడం లేదు. ముస్లింలకు జీవితము గడపడానికి ఒకే సిద్ధాంతం, ఒకే మార్గదర్శకత్వం అల్లాహ్ తరపు నుండి చివరి ప్రవక్త ముహమ్మద్ (సఅసం) ద్వారా లభించాయి. వాటితో ముస్లింలకు నేడు పేరుకు మాత్రం సంబంధం మిగిలిపోయింది. ఎంతో కాలము నుండి వారి జీవితాలు దైవప్రసక్తి లేని సిద్ధాంతాలలోను, ధర్మవిరుద్ధ మయిన నియమాల్లోనూ గడుస్తున్నాయి. దైవం ప్రసాదించిన అంతిమ గ్రంథం వారి వద్ద ఉంది! ఏ రూపంలో అవతరించిందో సరిగ్గా అదే రూపంలో ఇప్పటికీ ఉంది. కాని ముస్లింలు దానిని భద్రంగా ఎత్తిపెట్టారు దాన్ని వారు పఠించినా అందులోని విషయాలను అర్థం చేసుకొనడానికి, దాని ఆదేశాల ప్రకారం నడచుకోవటానికి బహు స్వల్పంగా కృషి చేస్తున్నారు. అందుకే వారి

నిత్య జీవితాల్లో దివ్య ఖుర్ఆన్ ప్రభావం బహు కొద్దిగా కానవస్తోంది.

నిజమయిన విశ్వాసులకు ఏ గౌరవ స్థానం ప్రేమాభిమానాలు లభిస్తాయని అల్లాహ్ తెలిపాడో అవి వారికి ఈ పరిస్థితుల్లో ఎలా ప్రాప్తమవుతాయి?

ముస్లిం వద్దనే ఈనాడు అల్లాహ్ అవతరింపచేసిన ఉద్గ్రంథం దాని అసలు రూపంలో ఉంది. అందుచేత వీరే అందరికన్నా అదృష్టవంతులు. కాని ఈ దైవవాణి తమ వద్ద ఉన్నప్పటికీ దాని శుభాలకు దూరంగా ఉన్న వీరు అందరి కంటే దురదృష్టవంతులు కూడా. ప్రజలు దివ్య ఖుర్ఆన్‌ని పఠించి, అర్థం చేసుకొని, దాని ప్రకారం నడుస్తూ, దాని ఉపదేశాలకనుగుణంగా తమ జీవితాన్ని గడిపేందుకే అది అవతరించింది. అప్పుడే వారికి ఇహపరాల్లో సంతోషం, సాఫల్యం చేకూరుతాయి.

ఈనాడు ప్రపంచంలో నలుదిక్కులా వ్యాకులత వ్యాపించింది. ఎటు చూచినా చెడు రాజ్యమేలుతుంది. స్వార్థం, అన్యాయం ప్రబలిపోయాయి. నైతిక విలువలు నాశనమవుతున్నాయి. మానవత్వం రోదిస్తోంది. దీని కంతటికీ కారణం మనిషి రాను రాను దైవాన్ని మరచిపోవడమే. అతని జీవితం కాల్పనిక సిద్ధాంతాలకు, విధానాలకు, శాసనాలకు లోబడి గడపటమే. ఇవన్నీ లోప భూయిష్టమైనవే. ఇవి జీవితాన్ని తీర్చిదిద్దడానికి బదులు దాన్ని అధోపతనానికి తోసేస్తున్నాయి. దోషాలు లేనటువంటి మానవులందరికీ మంచినీ శ్రేయాన్నీ ప్రసాదించే జీవిత విధానాన్ని మానవులను సృష్టించి పోషించే వాడు వారి మంచి చెడులు తెలిసినవాడు, వారి బలహీనతలను, స్వాభావిక అవసరాలను బాగుగా ఎరిగినవాడు అయిన ప్రభువే ఇవ్వగలడు. తన ఈ అనుగ్రహాన్ని నిత్యం ఆయన మానవునికి ప్రసాదిస్తూనే వచ్చాడు. ఆ అనుగ్రహమే నేడు "ఇస్లాం" పేరుతో మనకు లభించింది. ఈ ఇస్లాం, దైవికమైన ఈ జీవిత విధానం తన నిజ స్వరూపంలో, గతంలో స్థాపించబడింది. ప్రపంచం దాని సత్ఫలితాలను

చవిచూసింది. అప్పుడు మానవ జీవితం మంచికి ఆలవాలమయిందనీ, సుఖ సంక్షేమాలతో అలరారిందనీ చరిత్ర ఈ నాటికీ సాక్ష్యం ఇస్తోంది. ఈ వ్యవస్థను స్థాపించిన వారు మానవాళి ప్రేమాభిమానాలకుపాత్రులయ్యారు. గౌరవం వారిని వరించింది. వారు సమస్త జాతులకు నాయకులుగా, మార్గదర్శకులుగా పరిగణించబడ్డారు. దైవం ప్రసాదించిన ఈ కానుక, అంటే ఇస్లాం జీవన వ్యవస్థ ఈ నాటికీ మనకు లభ్యమవుతుంది. కాని దీన్ని వినియోగించకపోవడమే శోచనీయం. దీనిపై విశ్వాసమున్నట్లు ప్రకటించే వారే దీని ద్వారా మార్గదర్శకత్వాన్ని పొందడం లేదు. దైవగ్రంథం వెలుగులో తమ జీవిత విధానం ఏమిటో తెలుసుకోవాలన్న చింతే వారికి లేదు. వీరి నమ్మకాలు ఏమై ఉండాలి? వీరి ప్రవర్తన, గుణగణాలు ఎలా ఉండాలి? సత్యం ఏది? అసత్యం ఏది? వీరి ఇష్టాయిష్టాలు ఎలా ఉండాలి? స్నేహశత్రుత్వాలకు పునాదులు ఏమిటి? ఇతరులకు వీరిపై ఉన్న హక్కులేవి? వాటిని వీరు ఏవిధంగా నెరవేర్చాలి? వీరు తమ కుటుంబ జీవితాన్ని ఏ విధంగా గడపాలి? వ్యాపార వ్యవహారాలలో వీరు ఏ నియమాలు పాటించాలి. సామూహిక విషయాలు ఏ విధంగా నిర్వహించాలి? గౌరవం ఔన్నత్యం ఏ పనులవల్ల లభ్యమౌతాయి? అవమానం, అపజయం ఏ పనుల పర్యవసానంగా కలుగుతాయి? ముస్లింలు కావడం వల్ల ఈ విషయాలన్నింటినీ మనం దివ్యఖుర్‌ఆన్ ద్వారా తెలుసుకోవాలి. ఆ తరువాత దానికనుగుణంగా అమలు చెయ్యటానికి ప్రయత్నం చెయ్యాలి. కాని మనమిప్పుడా మాటల్ని ఇతరుల నుండే నేర్చుకుంటున్నాము. చివరకు నాస్తికుల్ని అనుసరించడంలో కూడా తప్పులేదని తలుస్తున్నాము. అందుకే దైవానుగ్రహాన్ని దగ్గర ఉంచుకొన్నప్పటికీ దాని వల్ల పొందవలసిన శుభాలను పొందలేకపోతున్నాము. ఈ కాంతిని ఒడిలో దాచుకుని స్వయంగా మనము అంధకారంలో తడబడుతున్నాము. ఇతరులకూ దారి చూపలేకపోతున్నాము.

పవిత్ర ఖుర్‌ఆన్ పట్ల మనమవలంబించిన వైఖరిలో ఎంత అన్యాయం ఉందో మీరు ఊహించండి. ఈనాడు మనం గౌరవహీనులమై అధోగతి యందున్నామంటే ఇది మనమవలంబించిన వైఖరి ఫలితం కాదా? అవును, ముమ్మాటికీ అదే! ఇక మనం ఈ దుర్దశ నుండి విముక్తి పొందాలని తలిస్తే దానికి మార్గం ఒక్కటే. అల్లాహ్ అవతరింపజేసిన ఖుర్‌ఆన్ పట్ల మరియు ఆయన ప్రసాదించిన "దీన్" ధర్మం పట్ల మనమవలంబించిన వైఖరిని విడనాడి దాన్ని అనుసరించేందుకు సంసిద్ధులం కావాలి.

ఈ అనుసరణ అర్థం ఏమిటో క్షుణ్ణంగా తెలుసుకోండి. ఇస్లాం అనబడే ఈ "దీన్" (ధర్మం), ఇతర అనేక మతాలవలె ఏదో కొన్ని ఆచారాల పూజా పురస్కారాల ధర్మం కాదు. ఇది యావత్తు మానవ జీవితాన్ని చర్చిస్తుంది. ప్రతి వ్యవహారంలో మనిషికి మార్గం చూపుతుంది. దివ్య ఖుర్‌ఆన్ మరియు మహా ప్రవక్త హదీసు (సూక్తు)లను పరిశీలిస్తే విస్పష్టంగా తెలుస్తుంది: కేవలం సరయిన విశ్వాసాలేమిటో, అల్లాహ్‌ను పూజించే పద్ధతి ఏదో, ధార్మికంగా దైవనామ సంస్మరణకు, దైవ స్తుతి స్తోత్రాలకు కల ప్రాముఖ్యత ఏమిటో అనే విషయాలే కాక మనిషి తన కుటుంబ జీవితాన్ని ఎలా గడపాలో వ్యాపార వ్యవహారాలలో ఏ హద్దులను పాటించాలో సభ్యత, సంస్కారాలు ఎలాఉండాలో, ఆదాయ వ్యయాల సూత్రాలు ఏవో, ప్రభుత్వ సంస్థాపన, పాలనావిధానాలేవో, యుద్ధం సంధి మూలసూత్రాలు ఏవయి వుండాలో– ఒకటేమిటి, మానవుని పూర్తి వ్యక్తిగత సామూహిక జీవితాల గురించి దివ్య ఖుర్‌ఆన్ మరియు మహాప్రవక్త సంప్రదాయాల్లో ఆదేశాలున్నాయి. ప్రభు దాస్యాన్ని చేయడానికి ఆయన పట్ల విధేయత కలిగి ఉండటానికి ఈ ఆదేశాలన్నింటిని తు.చ. తప్పకుండా అనుసరించడం తప్ప మార్గాంతరం లేదనే తాకీదులతో సహా ఉన్నాయి. ఏ ఒక్కదాని పట్ల కూడా నిర్లక్ష్యభావం కలిగి ఉండడానికి వీలులేదు.

అలా కాక ఈ దైవాజ్ఞల్లో కొన్నింటిని తెలిసీ త్రోసిపుచ్చటం విశ్వాసమార్గం కాజాలదు. ఇది మహా అపరాధం. దీనికి ఇహపరాల్లో కఠిన శిక్ష అనుభవించవలసి ఉంటుంది. అల్లాహ్ ఆదేశాల్లో నచ్చిన వాటిని అనుసరించడం, నచ్చని వాటిని అనుసరించకపోవడం విశ్వాస లక్షణాలు కావు. అతడు అవలంబించవలసిన మార్గం ఒక్కటే. పూర్తి ఖుర్ఆన్ అల్లాహ్ తరపు నుండి అవతరించినదని ఏ విధంగా అతడు నమ్ముతాడో అదే విధంగా ఈ దివ్య గ్రంథంలో ఉన్నదంతా కేవలం పారాయణం చేయడానికే కాదు, విధేయతతో అనుసరించడానికే అని అతడు ధృఢంగా విశ్వసించాలి. ఈ విధంగానే అల్లాహ్ దాస్యాన్ని ఆయన ఆజ్ఞాపాలనల బాధ్యతల్ని నెరవేర్చగలుగుతాడు. అప్పుడే ముస్లిం ఇహపరాలందు అల్లాహ్ కారుణ్యానికి అర్హుడౌతాడు.

☆ ☆ ☆

3. ముస్లిం

ఇంత వరకు చెప్పబడిన దాని ద్వారా "ముస్లిం" అంటే ఒక తెగ, కులం, వర్గం, వంశం, జాతి పేరు కాదు అని మీరు స్పష్టంగా అర్థం చేసుకున్నారు. ఒక ప్రత్యేక నమ్మకం, ఒక ప్రత్యేక వైఖరిని అవలంబించే వ్యక్తిని ముస్లిం అంటారు. ఈ ప్రత్యేక నమ్మకమేమిటో పూర్వపు అధ్యాయాలలో మీరు చదివారు. కాని ఈ ప్రత్యేక వైఖరికి సంబంధించిన వివరాలు ఇంకా మీ ముందుకు రాలేదు. వాటిని గురించి ఇపుడు తెలుసుకుందాము.

ఒక వ్యక్తి దైవ విధేయతను నిరాకరించడం "కుఫ్ర్" అనీన్నీ, దేవుని పట్ల విధేయత కలిగి ఉండడం ఇస్లాం అనీన్నీ మీరిదివరకే తెలుసుకున్నారు. 'ఇస్లాం' అంటేనే దైవ విధేయత, ఆయన ఆజ్ఞాపాలన అని అర్థం. ఈ విధేయత వల్ల మనిషిపై పడే ప్రాథమిక బాధ్యత ఏమిటంటే దేవుడు పంపిన హితోపదేశానికి విరుద్ధంగా ఉన్న ప్రతి విధానాన్నీ, ప్రతి శాసనాన్నీ, ప్రతి ఆదేశాన్ని తప్పైనదిగా, తిరస్కరించతగ్గదిగా భావించాలి. అల్లాహ్‌ను తప్ప ఇతరుల నెవ్వరిని తన శాశ్వత నిర్మాతగా అంగీకరించరాదు, ఇంకా అల్లాహ్ విధేయతకు అనుగుణంగా లేని ఆదేశాలను సరయినవిగా అంగీకరించడానికి ఒప్పుకోకూడదు. ఈ విషయంలో ఖుర్‌ఆన్ స్పష్టంగా ఉపదేశిస్తోంది.

> "ఎవరైతే అల్లాహ్ అవతరింపజేసిన ఆదేశాలననుసరించి తీర్పుచేయరో వారు వాస్తవంలో అవిశ్వాసులు" (మాఇదా : 44)

దీనివల్ల స్పష్టంగా తెలిసేదేమంటే జీవితంలో ఏదయినా సమస్య ఎదురైనప్పుడల్లా దాని పరిష్కార మార్గాన్ని అల్లాహ్ పంపిన హితోపదేశాల్లోనే అన్వేషించాలి. లభించిన మార్గాన్ని అనుసరించాలి. జీవితపు ప్రతి విషయంలో దైవగ్రంథమయిన దివ్య ఖుర్‌ఆన్ మరియు మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) సంప్రదాయం (సున్నత్) ఏమని ఆదేశిస్తున్నాయో చూడడం అవశ్యం. ఏ వ్యక్తి ఈ విధంగా చేసి ప్రతి సందర్భంలోనూ కేవలం ఖుర్‌ఆన్, సున్నత్‌లు సూచించే విధానాన్నే అవలంబిస్తాడో అట్టి వ్యక్తి విధానమే "ఇస్లాం" విధానం. మరెవరైతే ఇలా నడచుకోక అల్లాహ్ చూపిన మార్గాన్ని వదిలి, మనోవాంఛలు సూచించే విధానాలను లేక తాతముత్తాతల ఆచార సంప్రదాయాల అంధానుసరణ ఆధారంగా రూపొందించిన పద్ధతులను, లేక మానవుల అసంపూర్ణ మేధ కల్పించిన మార్గాలను అనుసరిస్తాడో ఆ వ్యక్తి మార్గం నిజానికి "కుఫ్ర్" మార్గమే. ఒక ముస్లిం అట్టి మార్గాన్ని ఎన్నటికీ పాటించలేడు. ఎవరైతే కేవలం అల్లాహ్ ఆజ్ఞల్ని పాలిస్తాడో, ఆయన ఆజ్ఞలకు ప్రతికూలంగా తన మనోవాంఛలకు లొంగడో, తన వంశాన్ని, జాతిని ఖాతరు చెయ్యడో, ఏ శక్తినైనను, తుదకు అది ప్రభుత్వమే అయినా దాన్ని ఖాతరు చేయడో ఆ వ్యక్తే ముస్లిం. ఎందుకంటే అతడు దాసుడు అయింది తన అల్లాహ్‌కు మాత్రమే. అల్లాహ్ దాస్యమే చేస్తాడు. అతడు ఇతరులెవ్వరికీ దాసుడు కాడు. కనుక ఎవరి దాస్యమూ చెయ్యడు. ఈ విషయంలో అల్లాహ్ ఆదేశాన్ని వినండిః

"ఓ ప్రవక్తా! చెప్పండి 'దైవ గ్రంథంకల ఓ ప్రజలారా! మాకూ మీకూ సమ్మతమయిన ఒక విషయం వైపునకు (ఒప్పందానికి) రండి (అంటే మీ ప్రవక్తలు తెలియజేసిన విషయం, దైవ ప్రవక్త అవటం చేత నేను చెప్పే విషయం కూడా అదే) అదేమంటే మనం అల్లాహ్ దాస్యం తప్ప మరెవ్వరి దాస్యమూ చేయరాదు; ఆయన దైవత్వంలో మరెవ్వరినీ

భాగస్వాములుగా ఎంచరాదు.' మరియు మనలో ఎవరైనా సరే అల్లాహ్‌ను కాదని మరొకరిని ప్రభువుగా ఎంచరాదు.' ఒకవేళ వారు ఈ మాటపట్ల విముఖత చూపారంటే వారితో చెప్పివేయండి." మీరు సాక్ష్యంగా ఉండండి. మేము ముస్లిములము. (అంటే అల్లాహ్‌కే విధేయులము, ఈ మూడు విషయాల్ని ఒప్పుకున్న వారము.) (ఆలి ఇమ్రాన్ : 64)

"ఏమి! వారు అల్లాహ్ విధేయతను కాదని అన్యుల విధేయతను అవలంబించదలచారా? వాస్తవానికి భూమ్యాకాశాల్లో ఉన్న సమస్తమూ ఇష్టమున్నా లేకపోయినా ఆయన విధేయతా మార్గాన్నే అనుసరిస్తోంది. మరియు అంతా ఆయన వద్దకే మరలి పోవలసి ఉంది."

(ఆలి ఇమ్రాన్ : 83)

ఈ రెండు వాక్యాల్లో ఒకే మాట చెప్పబడింది. అంటే అసలు (దీన్) ధర్మం అనేది దైవ విధేయత, ఆజ్ఞాపాలన అని. దైవవిధేయత అంటే ఆయన సన్నిధిలో అయిదు పూటలు 'సజ్దా' చేయటం కాదు. ఆయనను ఆరాధించడం అంటే ఆయన్ని పూజించటంతో పాటు మన పూర్తి జీవితంలో ఆయన ఆజ్ఞల్ని సహితం పాటించాలి. ఏ పనులకు దూరంగా ఉండాలని ఆయన మనల్ని ఆదేశించాడో వాటిని అసలు చేయరాదు. ఏ పనులను ఆయన చేయాలని ఆజ్ఞాపించాడో ఆ పనులను తప్పక చేయాలి. నిత్యం ప్రతి విషయంలోనూ అల్లాహ్ ఆజ్ఞ ఏమిటో అనే విషయాన్నే చూడాలి. ఆయనిచ్చిన ఆజ్ఞ తెలిసిన తరువాత మన మనసేమంటున్నది, మన బుద్ధివివేకాలు ఏమంటున్నాయి. ఫలాన మహనీయులు ఏమంటున్నారు. మన తాత ముత్తాతలు ఏమి చేసేవారు. వంశ ఆచారాలు, సంప్రదాయాలు ఏమిటి ప్రస్తుత కాలంలో జనసమ్మతమయిందేమిటి, ఈ విషయంలో అన్యుల దృక్పథం ఎలాగుంది?

అనే సందేహాలకు, యోచనలకు తావు ఇవ్వరాదు. మనం దైవాజ్ఞను కాదని మరొకరి మాటను స్వీకరించినట్లయితే క్రియాత్మకంగా వారిని దైవత్వంలో చేర్చినట్లే, కొంత వరకు దైవానికున్న స్థానం వారికి యిచ్చినట్లే, ఇది ఎంత అపాయకరమైన పరిస్థితి అంటే ఆ తరువాత మనిషి నేరుగా వినాశానికే గురి అవుతాడు. మానవుణ్ణి అల్లాహ్ దాస్యానికి దూరం చేసి వక్రమార్గం పట్టించే పెద్ద పెద్ద విషయాలు మూడున్నాయి, ఏ వ్యక్తి ముస్లింగా ఉండాలనీ, ప్రభువుదాస్యం చెయ్యాలని కోరుకుంటాడో, అతడీ మూడు విషయాలను క్షుణ్ణంగా తెలుసుకోవడం ఎంతో అవసరం మరియు వాటి పట్ల ఎంతో మెలుకువతో ఉండాలి కూడ. ఆ మూడు విషయాలివి;

1. స్వీయ దాస్యం
2. తాత ముత్తాతలు, తమ వంశాల లేక జాతి యొక్క దాస్యం.
3. ప్రపంచంలో ధనం మూలంగానో, అధికారం కలిగివుండడం వల్లనో పెద్దమనుషులుగా చెలామణి అయ్యే వారికి లేక ప్రజలు నాయకులుగా ఎన్నుకున్న వారికి దాస్యం చెయ్యడం.

1. స్వీయ దాస్యం గురించి అల్లాహ్ ఆదేశం ఇది :

"దైవాదేశాలకు మారు స్వాభీష్టాన్ని అనుసరించే వ్యక్తికంటే మార్గభ్రష్టుడు ఎవడు కాగలడు-దైవం ఇలాంటి దుర్మార్గులకు మార్గం చూపడు." (ఖసస్)

"తన వాంఛల్ని తన దైవంగా చేసుకున్న వ్యక్తి పరిస్థితిని గమనించారా? అలాంటి వ్యక్తి బాధ్యతను మీరు స్వీకరించగలరా? వారిలో అనేకులు మాట వింటారని లేక అవగాహన చేసుకుంటారని మీరు భావిస్తున్నారా? ఎంత మాత్రం కాదు. వీరు పశువులను పోలి ఉన్నారు. నిజం చెప్పాలంటే అంతకన్నా హీనంగా దిగజారినారు." (ఫుర్‌కాన్- *43,44*)

ఈ వాక్యాల వల్ల తేలేదేమంటే, ఏ వ్యక్తి తన మనోవాంఛల ప్రకారం నడచుకుంటాడో ఆ వ్యక్తి వాస్తవంగా తన మనస్సునే తన దైవంగా భావించుకుంటాడు. తన మనస్సుకు దాసుడయిన వ్యక్తికి, దైవానికి దాసుడవటం, దైవ దాసునిగా మనగలగటం సాధ్యపడదు. ఆ వ్యక్తి సతతం తాపత్రయ పడేది, నాకు ధనం ఎలా చేకూరుతుంది? గౌరవ మర్యాదలు, పేరు ప్రతిష్టలు పొందే మార్గం ఏది? భోగభాగ్యాలు ప్రాప్తమయ్యేదెలా? అనే విషయాలకోసమే. ఇవి ఏ పద్ధతుల ద్వారా ప్రాప్తమయ్యే అవకాశం కనిపిస్తుందో, దైవం ఎంత నిషేధించినా సరే, ఆ పద్ధతులనే అవలంబిస్తాడు- ఆ వ్యక్తి. ఇదే విధంగా ఏ కార్యాలవల్ల అతని మనోవాంఛలు పూర్తికావో వాటిని చేయాలని దైవం ఎంత గట్టిగా ఆదేశించినా, ఆ పనుల్ని అతడెన్నటికీ చేయడు. ఇలాంటి మనిషి తన అహాన్నే తన దైవంగా చేసుకున్నాడని చెప్పడంలో సందేహం లేదు.

2. తాత ముత్తాతల, లేక వంశం, లేక జాతి యొక్క దాస్యం చేసే వాడి స్థితి కూడా ఇంతే. ఒక ప్రత్యేక మార్గానికి బద్ధులైన వారినెందరినో మీరు చూస్తుంటారు. వారలా చేయడానికి కారణం వారి తాత ముత్తాతలు కూడా ఆ మార్గాలను అవలంబించడమే. వారు ఆచరించే పద్ధతులలో ఏది సరయినదో ఏది కాదో వారెన్నడూ యోచించరు. వారి తాత ముత్తాతలు ఒక రీతిని పాటించారు అని తెలవడమే చాలు - వారు దాన్ని అనుసరించడానికి, ఒకవేళ తాతముత్తాతల ఆచారాలకు విరుద్ధమైన అల్లాహ్ ఆజ్ఞలు వారి ముందుకు వస్తే వాటిని వారు త్రోసిపుచ్చుతారు. ఆ మేమయితే మా పెద్దలు అనుసరిస్తూ వచ్చిన విధానాన్నే అనుసరిస్తాము అని వాదిస్తారు. ఈ విధమైన వ్యక్తిని దైవ దాసుడని చెప్పడానికి ఏ కారణమూ కానరాదు. ఆ వ్యక్తి తన తాత ముత్తాలకు తన వంశానికే దాసుడు కాని దైవదాసుడు ఎలా కాగలడు? ఇలాంటి వారి విషయంలో అల్లాహ్ ఈ విధంగా ఉపదేశించాడు.

"ఏ ధర్మాన్ని అల్లాహ్ అవతరింపజేశాడో దాన్ని అనుసరించండి" అని వారితో అన్నప్పుడల్లా వారు "మేము మాత్రం మా తాత ముత్తాతల ద్వారా మాకు సంక్రమించిన మార్గాన్నే అనుసరిస్తాము." అని అంటారు. "వారి తాతముత్తాతలు ఏ మాత్రం జ్ఞానంలేనివారై వారికి సన్మార్గం ప్రాప్తించకపోయినా వారు వారినే అనుసరిస్తారా?" (బఖర-170)

"అల్లాహ్ అవతరింపజేసిన ఆదేశాల వైపునకు మహాప్రవక్త (చూపిన మార్గం) వైపునకు రండి." అని వారికి చెప్పినప్పుడు 'మా తాత ముత్తాతలు అనుసరిస్తూ ఉండగా మేము చూచిన మార్గమే మాకు చాలు' అంటారు, వారు వారి తాత ముత్తాతలకు ఏ విషయమూ తెలియకపోయినా, వారు సన్మార్గాన్ని అనుసరించకపోయినా వారు వారినే అనుసరిస్తారా?" (మాయిదా-104)

తాత ముత్తాతలను ఇలా గ్రుడ్డిగా అనుసరించడం అనేది పెద్ద మార్గభ్రష్టత; దాదాపు ప్రతియుగంలో మూఢప్రజలు ఈ మార్గభ్రష్టతకు గురయ్యారు. దైవ ప్రవక్తల మార్గదర్శకత్వం నుండి మానవుణ్ణి దూరం చెయ్యడంలో ఇది ఎంతో ప్రముఖపాత్ర వహించింది. పూర్వప్రవక్తల కాలంలో వారి జాతివారు తమ ప్రవక్తల సందేశాన్ని తిరస్కరిస్తూ -

"మీ మాటలను మేము ఏ విధంగ అంగీకరించగలం? మీరు చెప్పినదంతా మా తాత ముత్తాతల ఆచరణకు పూర్తిగా భిన్నమయిందే"

అని పలికారని పవిత్ర ఖుర్ఆన్ ప్రస్తావిస్తుంది. ఇట్టి వారందరికి సహజంగా ఒకటే సమాధానం ఇవ్వడం జరిగింది: "సేవా, దాస్యాలు కేవలం ఒక్కరికి చేయడమే సాధ్యం. దేవుని దాస్యమయినా చేయండి లేదా తాత ముత్తాతల కయినా దాసులయి జీవించండి. ఇరువురికి దాస్యం చేయడమనేది అసంభవం.

ఆలోచించుకోండి దాస్యం పొందడానికి అర్హులెవరు? దైవమా లేక మీలాగే దైవంచేత సృష్టించబడ్డ మీ తాత ముత్తాతలా? ఋజుమార్గాన్ని అనుసరించదలిస్తే, దైవ దాస్యాన్ని చేయాలనే మీ అభీష్టమయితే అన్నింటినీ వదలి అల్లాహ్ తరపు నుండి ఆయన ప్రవక్తలు తెచ్చిన ఉపదేశాలనే స్వీకరించండి."

3 సత్య మార్గంలో ఎదురయ్యే మూడవ అవాంతరం, మత గురువులు, సంఘ నాయకుల దాస్యం. చాలామంది ఆలోచనా తీరు ఈ విధంగా వుంటుంది.

"ఫలానా వ్యక్తి చాలా గొప్పవాడు. అతని మాట సత్యమయింది. ఫలానా వ్యక్తి చాలా శ్రీమంతుడు పేరు ప్రతిష్టలు కలవాడు. అతని మాటల్ని తప్పక నమ్మవలసిందే. లేకపోతే పనులు జరగవు. ఫలానా వ్యక్తి గొప్ప బలగం అధికారం కలవాడు, అతను చెప్పేది వినడం తప్ప గత్యంతరంలేదు. ఫలానా స్వాములవారు గొప్ప శక్తి కలవాడు ఆయన మాటను కాదంటే ఆయన శాపానికి గురి అయి వినాశం తప్పదు. ఫలానా జాతి గొప్ప ప్రగతి సాధిస్తోంది. దాని మార్గాలనే అవలంబించాలి. లేకపోతే మేము వెనుకబడతాము"- ఎవరైతే ఈ విధంగా యోచిస్తారో వారికి సన్మార్గ ద్వారాలు మూసివేయబడతాయి. దైవ దాస్య మార్గాన్ని వారెన్నటికీ పొందలేరు. అల్లాహ్ ఈ విధంగా ప్రబోధిస్తున్నాడు.

> "లోకంలో నివసించే ప్రజలు చాలా మంది ఎలాంటి వారంటే ఒకవేళ మీరు వారి మాటను విన్నారంటే వారు మిమ్మల్ని దైవమార్గానికి దూరం చేస్తారు." (అన్ ఆమ్-117)

పైన విశదీకరించిన మూడు విషయాలు ఒక మనిషిలో ఉన్నంత వరకు అతడు ఋజుమార్గానికి రాలేడు. అందుకే ఋజు మార్గం పొందడానికి, దానిపైనే నిలకడతో ఉండడానికి మనిషి హృదయం ఈ మూడు రుగ్మతల

నుండి సురక్షితంగా ఉండడం ఎంతో అవసరం. ఋజుమార్గం ఒక్కటే, మానవు దేవునికి తప్ప మరెవ్వరికీ దాసుడు కాకూడదు. ప్రవక్తను తప్ప ఇంకెవ్వరినీ అనుసరించరాదు. ఇంకా ఆ వ్యక్తి ఈ విధంగా విశ్వసించాలిః దైవం, ఆయన ప్రవక్త తెలిపినదే పరమ సత్యం. దానికి వ్యతిరేకంగా ఉండేదంతా అసత్యం. తనకు గౌరవ మర్యాదలు కేవలం దైవం, దైవప్రవక్తల విధేయతవల్లనే లభిస్తాయి. జీవితపు ఏ విషయంలోనయినా సరే ఈ విధేయతా మార్గానికి బదులుగా మరే మార్గాన్ని అనుసరించినా అది ఇహలోకంలో హానికరంగాను, పరలోకంలో వినాశకరంగానూ పరిణమిస్తుంది అని దృఢంగా నమ్మాలి. ఒక విషయం గురించి దైవాజ్ఞలు తెలియగా మనిషి దానికి తల ఒగ్గి నడచుకోవాలి. దానికి వ్యతిరేకంగా ఆచరించే ఆలోచన కూడా అతనికి రాకూడదు. ఇలా చేయడం వల్ల లోకులు ఎన్ని వంకలు పెట్టినా, అయిన వారు, కాని వారు ఎన్ని చెప్పినా పెద్దలకు ఎంత ఆగ్రహం కలిగినా వారందరికీ ఇచ్చే సమాధానం ఒక్కటే. "నేను కేవలం దేవుడికే దాసుడను. అహానికి, వంశీయులకు, ఏ పెత్తందార్లకు, ఏ మతగురువుకు, ఏ అధికారికీ ఏ పాదుషాకూ దాసుణ్ణికాను." ఋజుమార్గానికి వక్రమార్గానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని, దేవుని నిజమైన దాస్యానికి, తప్పుడు దాస్యానికి మధ్య ఉన్న తారతమ్యాన్ని తెలుసుకోవడానికి దివ్య ఖుర్‌ఆన్ ప్రబోధాలను చదవండిః

> మేము(సత్యాన్ని, అసత్యాన్ని) విశదపరిచే ఆయత్‌లను అవతరింపజేశాము. తాను ఇష్టపడిన వారికి అల్లాహ ఈ ఆయత్‌ల ద్వారా ఋజు మార్గం చూపిస్తాడు. అల్లాహ మరియు ఆయన ప్రవక్తను విశ్వసించాము. వారికి విధేయులమై ఉండడానికి ఒప్పుకున్నాము అని అంటారు ప్రజలు. అటు తర్వాత వారిలో కొందరు విధేయతకు విముఖత చూపుతారు. ఇలాంటి

వారు విశ్వాసులు కారు. వారి మధ్య ఉన్న వివాదాల తీర్పు చేయడానికి వారిని అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త వైపునకు పిలిచినప్పుడు వారిలో కొందరు వెనుతిరుగుతారు. కాని విషయం వారి కనుకూలమయినదైతే దాని పట్ల ఎంతో విధేయతా భావం కనబరుస్తారు. ఉత్సాహంతో ముందుకు వస్తారు. వీరి హృదయాలకు ఏదైనా రోగం పట్టుకుందా? లేక వారు ఏదయినా సందేహానికి లోనయ్యారా? లేక అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త వీరి హక్కులను కొట్టివేస్తారనే భయం వారిని పట్టుకుందా? కాదు. వీరు స్వయంగా తమపై జులుం చేసుకుంటున్నారు. వాస్తవానికి విశ్వాసులయిన వారి పద్ధతి ఏమంటే, వారి మధ్య తీర్పు చేయడానికి, వారిని అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తవైపునకు పిలిచినప్పుడు, వారు, "మేము విన్నాము, అంగీకరించాము" అని అంటారు. ఇట్టివారే మోక్షం పొందే వారు. ఎవరైతే అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తకు విధేయులై ఉంటారో, మరియు అల్లాహ్ పట్ల భయభీతులు కలిగి ంటారో, ఆయన అవిధేయతకు దూరంగా ఉంటారో వారే సాఫల్యం పొందేవారు."

(నూర్ : 46-53)

ఇదే దైవవిశ్వాసి యొక్క నిజ స్వరూపం. ఎవరైతే అల్లాహ్ గ్రంథానికి, ఆయన ప్రవక్తకు తనను తాను సమర్పించుకుంటాడో, అటు నుండి లభించిన ప్రతి ఆజ్ఞకు శిరసావహిస్తాడో, ఆ ఆజ్ఞలకు అభిముఖంగా తన మనోవాంఛలను కాని, వంశీయుల మాటలను కాని, ప్రజల అభిప్రాయాలను కాని, వినకుండా వ్యవహరిస్తాడో అతడే ముస్లిం. ఈ స్థితి ఎవరిలో జనిస్తుందో అతడే ముస్లిం. అతడే మోమిన్.

☆ ☆ ☆

4. ముస్లింల బాధ్యత

ఇస్లాం అంటే ఏమిటి? ముస్లిం అని ఎవరినంటారు? అన్న విషయాలను మనం తెలుసుకున్నాము. ఒక వ్యక్తి ముస్లిం కావడం వల్ల అతడు నిర్వహించవలసిన బాధ్యతలేమిటో తెలుసుకొందాము. **"లా ఇలాహ ఇల్లల్లాహు ముహమ్మదుర్ రసూలుల్లాహ్"** అనే కలిమాపై గల నమ్మకం ఒక మనిషిపై మోపే బాధ్యతలేమిటి? అల్లాహ్ పట్ల విధేయత, దాస్యాల ప్రమాణం చేసిన వారి జీవితం ఎలా ఉండాలి? ఈ ప్రశ్నలకు సమాధానాలు కొంతవరకు పూర్వము వచ్చాయి. అంటే ముస్లిం అనే వ్యక్తి అల్లాహ్, ఆయన ప్రవక్తల యొక్క ఆదేశాలను పూర్తిగా పాటించాలి. అతని పూర్తి జీవితము దివ్య ఖుర్ఆన్ మరియు మహాప్రవక్త సున్నత్(సంప్రదాయా)ల కనుగుణంగా ఉండి తీరాలి అని. ఇక మిగిలిందేమంటే ఒక ముస్లిం తన జీవితాన్ని దైవాదేశాలకు అనుగుణంగా మలచుకోవడంతో పాటు, అతను ఇంకా చేయవలసినది ఎంతో ఉంది. దాన్ని చెయ్యకుండా అతడు ముస్లింగా తన బాధ్యతల్ని ఏమాత్రమూ నిర్వహించలేడు. అప్పుడు అతని ఇహపరాలు రెండూ ప్రమాదానికి గురి అవుతాయి. ఈ బాధ్యత ఏమిటో అల్లాహ్ ప్రవచనం ద్వారా తెలుసుకోండి.

> "ఈ విధంగా లోకంలోని ప్రజల ఎదుట మీరు సాక్షులై ఉండేందుకు, మరియు ప్రవక్త మీపై సాక్షి అయి ఉండేందుకు మిమ్మల్ని మధ్యస్థ సమాజంగా నియమించాము. *(బఖర-143)*

ముస్లింలు, ప్రపంచంలోని ఇతర జాతుల వలె, సముదాయాలవలె కాక ఒక ప్రత్యేక సముదాయం (Community) అని పై దైవ వాక్యం వల్ల స్పష్టమౌతుంది. మానవులందరి ముందు అల్లాహ్ ధర్మానికి సాక్ష్యమిచ్చే లక్ష్యం గల ఒక ఉమ్మత్ (సమాజం)గా దీన్ని అల్లాహ్ రూపొందించాడు. ఏ విధంగా అల్లాహ్ ప్రవక్త స్వయంగా వీరి ఎదుట ఈ సాక్ష్యం ఇచ్చారో అదే విధంగా వీరు కూడా ప్రజల ముందు సాక్ష్యం ఇవ్వాలి. అంటే ఈ సాక్ష్యం ఫలితంగా అల్లాహ్ పంపిన 'దీన్' (ధర్మం) పూర్తిగా ప్రజల ముందు వ్యక్తంకావాలి. తరువాత ప్రళయ దినం నాడు ప్రభువు దర్బారులో ప్రజలు "మాకు దీన్ విషయం ఏమాత్రం తెలియదు. దీన్ని ఎవరూ మాకు విశదీకరించలేదు. కనుక మేము ఈ దీన్‌ను అనుసరించే అవకాశం ఏది?" అని ఫిర్యాదు చేయడానికిగాని, తమ అసహాయతను తెలుపుకోవటానికి కానీ అవకాశం ఉండరాదు.

అల్లాహ్ ఈ ఉమ్మత్ (ముస్లిం సమాజం)పై మోపిన బాధ్యత ఎంతో మహత్తరమైంది. ఎంతో ప్రాముఖ్యం కలది కూడా. దీని ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడానికి ప్రపంచంలో ప్రవక్తలు రావడాన్ని అల్లాహ్ తన ఆదేశాలను వీరిద్వారా పంపడాన్ని సవివరంగా పరిశీలిద్దాము.

దైవ గ్రంథాలన్నీ ఒక్క మాటను స్పష్టంగా తెలుపుతున్నాయి ప్రపంచంలో ఇంతవరకు పుట్టిన మానవులంతా ఇంకా ప్రళయం వరకు పుట్టబోయేవారంతా ప్రళయమైదానంలో అల్లాహ్ ముందు హాజరవుతారు. ప్రపంచంలో ఏమి చేశారో తెలుపవలసిందని వారిని అడగడం జరుగుతుంది. ఇలాంటి సమయం వస్తుందని, ఈ ప్రశ్నను ఎదుర్కోవటం ఉంటుందని భావించక నిర్లక్ష్యభావంతో ప్రపంచంలో తమ జీవితాన్ని అల్లాహ్ అభీష్టానికి

వ్యతిరేకంగా గడిపిన వారికి ఇది ఎంతో గడ్డు సమయంగా కలవర పరిచేదిగా ఉంటుంది. ఈ సంక్లిష్ట సమయాన్ని ఈ పర్యవసానాన్ని తెలపడానికే అల్లాహ్ ఆదినుండి తన ప్రవక్తలను, తన గ్రంథాలను పంపుతూ వచ్చాడు. అందరికంటే ముందు ఆదిమానవుడయిన ఆదం (అలై)ను తన ప్రవక్తగా నియమించాడు. దైవం ఇష్టపడే విషయాలేవో, ఏ విషయాలను ఆయన ఇష్టపడడో అంతా ఆయనకు అల్లాహ్ స్పష్టంగా తెలియజేశాడు. అటు పిమ్మట ఆయన తన ప్రవక్తలను క్రమంగా పంపుతూ వచ్చాడు. వారంతా ప్రజలకు వారి సృష్టికర్త అభీష్టము ఏమిటో, ఆయనకు ఇష్టమైన సవ్యమైన జీవన మార్గం ఏదో, వారు చేయవలసిందేదో, చేయరానిదేదో పరలోకంలో వారికి మోక్షం, అల్లాహ్ ప్రసన్నత లభించే మార్గం ఏదో తెలుపుతూ వచ్చారు. దేవునికి ఇష్టమైనదేదో? అయిష్టమైనదేదో? ప్రజలకు సరిగ్గా తెలియచేసే బాధ్యత ప్రవక్తలపై ఉంటే ఆ ప్రవక్తలను విశ్వసించి, వారు చూపిన విధానాలను అవలంబించడం సామాన్య ప్రజల బాధ్యత. తదనుగుణంగా వారిపై మోపబడిన బాధ్యతలను గురించి ఇరుపక్షాల వారినీ ప్రళయదినాన ప్రశ్నించడం జరుగుతుంది. ప్రవక్తలు తమ బాధ్యతలను ఎంతవరకు నిర్వహించారు, ప్రజలకు వారి ప్రభువు ఆజ్ఞల్ని సరిగ్గా సంపూర్ణంగా అందజేసారా లేదా? అని వారిని అడగడం జరుగుతుంది. ఇక ప్రజలు ఆ ప్రవక్తల సందేశం పట్ల ఏ వైఖరిని అవలంబించారో వారిని అడగడం జరుగుతుంది.

"ఏ ప్రజల వద్దకు మా ప్రవక్తలు పంపబడ్డారో వారిని మేము (ఆ ప్రవక్తల సందేశాన్ని స్వీకరించారా లేదా అని) తప్పక ప్రశ్నిస్తాము. మరియు మేము ప్రవక్తల్ని కూడా (మా సందేశాన్ని ప్రజలకు ఎంతవరకు అందజేశారు అని) తప్పక ప్రశ్నిస్తాము." (ఆరాఫ్-6)

ఈ కారణం వల్లనే ప్రవక్తలందరు తమ బాధ్యత యొక్క ప్రాముఖ్యతను గ్రహించి ప్రజలకు సత్యాన్ని అందజేయడంలో ఏ మాత్రమూ అశ్రద్ధ చూపలేదు. ఈ బాధ్యతే ఆఖర్లో మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)పై మోపబడింది. ఆయన కూడా ఈ బాధ్యతను సంపూర్ణంగా నిర్వహించారు. ఆయన "నేను సత్య సందేశాన్ని మీకు అందజేశానా లేదా, చెప్పండి!" అని ప్రశ్నించారు. దానికి, "నిస్సందేహంగా మీరు అల్లాహ్ దీన్‌ని మాకు అందజేశారు" అని ప్రజలందరు ముక్త కంఠంతో పలికారు. మహాప్రవక్త పైకి చూస్తూ "అల్లాహ్ నీవే సాక్షివి, నేను నీ దీన్‌ని నీ దాసులకు సరిగ్గా హెచ్చుతగ్గులు చేయకుండా అందజేశాను" అని పలికారు. అప్పుడే ప్రజలకు తాకీదు చేశారు. "నేను మీకు అందజేసిన దాన్ని మీరు ఇతరులకు అందజేయండి."

సత్యానికి సాక్ష్యం ఇచ్చే ఈ మహత్తర బాధ్యతని ముస్లిం సమాజం (ఉమ్మత్) ప్రళయము వరకు నిర్వర్తించవలసి ఉంది. అందువల్ల ఈ జీవితంలో ముస్లింలు చేయవలసిన అసలు పనేమిటంటే అల్లాహ్‌కు సమ్మతమైన ధర్మాన్ని, తమకు లభించిన మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఉపదేశాలను ఇతరులకు అందజేయాలి. ఏ విధంగా అల్లాహ్ ప్రవక్తదాన్ని తమకు అందజేశాడో అదేవిధంగా అందులో ఏమాత్రం హెచ్చు తగ్గులు లేకుండా ఇతరులకు అందజేయాలి. ఈ బాధ్యతకే 'షహాదతే హఖ్' (సత్యానికి సాక్ష్యం) అని పేరు.

ఈ (షహాదతె-హఖ్) విధిని నిర్వహించడానికి రెండు పనులు చెయ్యడం తప్పనిసరి అవుతుంది. మొదటిది, దైవ గ్రంథం మరియు మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) సున్నత్ (సంప్రదాయం) మూలంగా మనకు అందిన సత్యాన్ని (ధర్మాన్ని) మనం మాటల ద్వారా, వ్రాత ద్వారా ప్రపంచానికి చాటి చెప్పాలి. ఈ పనిని చేయడానికిగాను, ప్రచారంలో ఉండి ధర్మసమ్మతంగా

ఉన్న సాధనాలన్నింటినీ ఈనాడు వినియోగించవలసి ఉంటుంది. వాటి ద్వారా దైవ ధర్మ బోధలన్నీ ప్రజలముందు ప్రస్ఫుటం కావాలి. ఇంకా, అల్లాహ్ పంపిన ఈ దీన్ మాత్రమే సత్యమైనదనీ, ఇదే వారి జీవిత వ్యవహారాలలో సరయిన మార్గం చూపుతుందనీ, దీన్ని పాటించడం ద్వారానే పరలోకంలో అల్లాహ్ సంతోషాన్ని పొందగలరనీ వారు గ్రహించగలగాలి.

చేయవలసిన రెండవ పని: మన ఆచరణ ద్వారా సాక్ష్యం ఇవ్వడం అంటే ఏ బోధనలను మనం సత్యమైనవిగా భావిస్తామో వాటిని మనం మన నిత్య జీవితంలో ఆచరించి చూపాలి. మన ప్రవర్తన, మన నైతికత, మన వ్యవహారాలు, మన లావాదేవీలు ఒకటేమిటి, మన జీవితంలోని ప్రతిరంగం అల్లాహ్ పంపిన దీన్‌కు ప్రతీకగా మారాలి. తద్వారా ప్రపంచం ఇస్లాంను కేవలం ఉపన్యాసాల ద్వారా, వ్యాసాలద్వారానే కాక మన ఆచరణ ద్వారా కూడా అర్థం చేసుకోగలగాలి. ఈ దీన్‌ను అవలంబించడం వల్ల మనుషులు ఎంత మంచి వారవుతారో, ఎలాంటి పవిత్ర సమాజం రూపొందుతుందో, ఎంత పరిశుద్ధమయిన, పవిత్రమైన సంస్కృతి నెలకుంటుందో, వివిధ శాస్త్రాల్లో, విద్యల్లో, లలిత కళల్లో, సాహిత్యంలో ఎలాంటి నిర్మాణాత్మకమైన, మానవాళికి శ్రేయస్కరమైన పరిణామ వికాసాలు కలుగుతాయో, న్యాయం సానుభూతి ప్రేమాభిమానాలు విలసిల్లే ప్రశాంత వాతావరణం ఎలా ఉద్భవిస్తుందో, ఎటుచూచినా సదాచారం, సద్గుణాలు ఏ విధంగా వృద్ధీ వికాసమొందుతాయో ఏ విధంగా చెడు నిర్మూలించబడుతుందో అంతా ప్రజలు కళ్ళారా చూడగలగాలి. ఇలాంటి పరిస్థితులు ఏర్పడడం అవి ప్రపంచ దృష్టిలోకి రావడం, ఇస్లాం ఒక సత్య ధర్మం అనే యదార్థానికి తిరుగులేని తార్కాణాలు అవుతాయి.

మాటలతోను, వ్రాతతోను, ఇచ్చే సాక్ష్యంతో పాటు ఈ ఆచరణాత్మక

సాక్ష్యం కూడా ఇచ్చినప్పుడే ముస్లిం సమాజంపై మోపబడిన మహత్తరమయిన 'షహాదతె హఖ్' (సత్యానికి సాక్ష్యం ఇచ్చే) బాధ్యత తీరినట్లవుతుంది. ఆ తరువాత కూడా ఎవరైనా సత్యాన్ని స్వీకరించక అసత్యంతోనే ముడిపడి ఉన్నట్లయితే, వారు తమ ఈ వైఖరికి పూర్తిగా తామే బాధ్యులు. ముస్లిం సమాజం (ఉమ్మత్) పై వారిని గురించి ఎలాంటి బాధ్యత ఉండదు. ప్రళయ దినాన ప్రభువు సమక్షంలో హాజరయినప్పుడు ముస్లిం సమాజం "మాకు సాధ్యమయినంత వరకు "దీన్" విషయాలను వారికి అందజేశాము. వారు దాన్ని స్వీకరించకపోతే అది వారి తప్పు. మేము బాధ్యులం కాము" అని సమాధానం చెప్పుకోగలుగుతుంది. కాని ఒకవేళ ఈ 'ఉమ్మత్' తన బాధ్యతను విస్మరిస్తే న్యాయరీత్యా మానవుల మార్గభ్రష్టతకు ముస్లింలు కూడా బాధ్యులవుతారు. రేపు దేవుని దర్బారులో ఈ ప్రజలు అల్లాహ్‌కు సమ్మతమైన 'దీన్' (ధర్మం) ఏమిటో మాకు తెలియదని తమ నిస్సహాయతను కనబరిస్తే, ఈ ఉమ్మత్‌ను తన (దీన్) ధర్మానికి అమానతుదారుగా, దాని ప్రచారానికి బాధ్యులుగా నియమించిన అల్లాహ్ విచారణ జరుపుతాడు. ఒక వేళ ఉమ్మత్ తన విధిని నిర్వహించడంలో అశ్రద్ధను చూపినట్లయితే దాని పర్యవసానం ఏమౌతుందో గమనించండి.

కాని ప్రస్తుతం "ఒకవేళ" అనడానికి కూడా అస్కారం లేదు. ఈనాడు ఉమ్మత్ ఈ విధి నిర్వహణలో చూపే అలక్ష్యం, అశ్రద్ధ, కొండలాంటి నిజం. అది అందరి కళ్ళ ముందు కనిపిస్తూనే ఉంది. ఏ ఉమ్మత్ అల్లాహ్ దీన్ పట్ల మనసా, వాచా, కర్మణా సాక్ష్యం ఇవ్వటానికి నియుక్తమైనదో అది ఇపుడు సర్వసాధారణంగా దానికి విరుద్ధంగా సాక్ష్యం ఇస్తోందన్న విషయాన్ని చూచి షహాదతే హఖ్ (సత్యానికి సాక్ష్యమిచ్చే) బాధ్యతను గ్రహించిన ప్రతిహృదయం

ఎంతో కంపించిపోతోంది. జీవిత రంగంలో ఇతర జాతులు ఏమార్గాలను అనుసరిస్తున్నాయో ఇంచుమించు ఆ మార్గాలనే ఈ ఉమ్మత్‌లోని అధిక సంఖ్యాకులు అనుసరిస్తున్నారు. సర్వసాధారణంగా మన పరిస్థితి ఎలా ఉందంటే మన ఆచరణ మాట అలా ఉంచి మన మాటల్లోనైనా సత్యానికి సరయిన సాక్ష్యం ఇవ్వడంలో మనం అతి ఘోరంగా విఫలమయ్యాము. ఈ ఉమ్మత్‌లో సజ్జనులు, నిష్ఠాపరులు లేకపోలేదు. కానీ అసలు ప్రశ్న ఏదో కొంత శాతం మనుషులది కాదు. పూర్తి ఉమ్మత్‌కు సంబంధించినది. మొత్తంమీద ఉమ్మత్ పరిస్థితి ఎలా ఉందో అది అందరికీ తెలిసినదే. ప్రవర్తనలో, వ్యవహారాల్లో మన పరిస్థితి ఇతరులకంటే ఏ మాత్రం మెరుగ్గాలేదు. మన విశ్వాసాలు నిర్జీవాలై మూఢత్వానికి ఆహుతి అయ్యాయి. దీన్ నియమాలను పాటిస్తున్నామంటే అది కూడా కొన్ని ఆచారాలవరకే. చెప్పుకోవడానికి ముస్లింలే కాని ఈ "ముస్లింలు" అబద్ధం చెబుతారు, దొంగతనాలు చేస్తారు. దౌర్జన్యాలు చేయ గలుగుతారు. ఆడినమాట తప్పుతారు. మోసం చేయగలుగుతారు. అల్లకల్లోలాలు, అలజడులు రేకెత్తించగలుగుతారు. సిగ్గుమాలిన పనులన్నీ చేయగలుగుతారు. వీరు జీవించే తీరులోనేమి, ఆచార వ్యవహారాల్లోనేమి, పండుగల్లో, వేడుకల్లో ఉత్సవాలు ఊరేగింపుల్లోనేమి, ఎటుచూచినా ఇస్లాం మరియు ముస్లింల నొసటపై మచ్చలా కనబడే అసహ్యమైన పనులే గోచరిస్తాయి. వీరు వ్యక్తిగత సామూహిక జీవితాల్లోని ఒక్కొక్క విభాగాన్ని వికృతం చేశారు. ఈ పరిస్థితి ఎంత భయంకరంగా ఉందో ఆలోచించండి. ఇళ్ళు, అంగళ్ళు, వీధులు, బజార్లు మొదలుకొని రాజకీయరంగాల్లో, ప్రభుత్వదర్బారుల్లో, పాఠశాలల్లో ఆశ్రమాలు మొదలుకొని ఆరాధనాలయాల వరకు ఎక్కడా ఇస్లాం నిజస్వరూపం కానరాదే! ఏ దేశాలలో ముస్లింలు అల్ప సంఖ్యాకులై ఉండి అధికారం ఇతరుల చేతుల్లో ఉందో అక్కడి విషయం వేరు. ఏ దేశాలలో ముస్లింలు తమ ప్రభుత్వాలను

స్థాపించుకుని ఉన్నారో, ఆ దేశాలలో కూడా ఇస్లాం శాసనాలను కాదని, ఇస్లామేతర చట్టాల్ని పాటిస్తున్నారు. పరిస్థితుల ఈ స్వరూపాన్ని చూచి అల్లాహ్ పంపిన ధర్మాన్ని ప్రపంచానికి అందజేయటానికి బదులు ముస్లింలు దాన్ని మరుగుపరచారని చెప్పడంకంటే గత్యంతరం లేదు. ప్రపంచం ఈనాడు దైవోపదేశాలకు దూరంగా ఉందంటే దానికి ముస్లింలు కూడా బాధ్యులే!

సత్య ధర్మం పట్ల ముస్లింలమైన మనం కనబరచిన ఉపేక్షలవల్లి, అవలంబించిన అసమర్థతా వైఖరివల్ల మన పరిస్థితి, ప్రజల ధన, మాన, ప్రాణాలను రక్షించటానికి బదులుగా వారిని దోచుకునే, హత్య చేసే వంటి వినాశకృత్యాలు చేసే పోలీసులవలె ఉంది. మన పరిస్థితి ఇలా ఉంటే న్యాయం రీత్యా మనపట్ల అల్లాహ్ వ్యవహరించే తీరు కూడా ఇలాగే ఉండాలి. అందుకే అదే విధంగా ఉంది కూడా. మనం చేసిన మహాపరాధానికే ఘోరమైన శిక్ష నిర్ణయమయింది. ఈ శిక్షకు ఒక భాగం మనం ఈనాడు ప్రపంచంలోనే అనుభవిస్తున్నాము. మనం హీనదశకు అణగిపోయాము. ఇతరుల పాలనలో బానిసలయ్యాము. ఈ శిక్షకు రెండవ భాగాన్ని పరలోకంలో చవిచూడబోతున్నాము. వాస్తవానికి అసలు తీర్పు జరిగేది అక్కడే. అక్కడ జరిగే పరీక్ష నిస్సందేహంగా అతి కఠినమయినది.

ఆ పరీక్ష నుండి బయట పడాలంటే, ఆ శిక్షను తప్పుకోవాలంటే ఒకటే మార్గం. మనం తప్పును సరిగా గ్రహించగలగాలి. ఆ శిక్ష నుండి విముక్తి పొందేందుకు కృషిలో నిమగ్నం కావాలి. ఎంతో కాలంగా మనం మన బాధ్యతల్ని మరచి పోయాము. మనం ఏ లక్ష్య సిద్ధికై ప్రభవింపబడ్డామో దాన్ని పూర్తిగా విస్మరించి కూర్చున్నాము. దాని పర్యవసానమే అనుభవిస్తున్నాము. ఈ బాధ్యతను నెరవేర్చేందుకు మనం సిద్ధం కానంతవరకు మన భవిష్యత్తు అంధకారంగానే ఉంటుంది. దాన్ని జ్యోతిర్మయం చేయాలంటే మనం 'దీన్

(ధర్మం) వైపునకు మరలి రావాలి. ఆ 'దీన్'తో పై పై సంబంధాలు కలిగి ఉండటానికి మారుగా పూర్తి సంబంధాలు పెంపొందించుకోవాలి. దాన్ని వాస్తవంగా మన ధర్మం చేసుకోవాలి. మన జీవితంలోని ప్రతి విభాగాన్ని దాని ఆదేశాలకనుగుణంగా మార్చాలి. మన కుటుంబాలలో, మన వంశంలో, మన సమాజంలో మన పాఠశాలల్లో , మన సాహితీ మండలాలలో, పత్రికా రచనల్లో, మన వ్యాపార ఆర్థిక వ్యవహారాల్లో, మన సంఘాలలో, మన జాతీయ సంస్థలలో ఇంకా సాధ్యపడిన చోటల్లా మన ప్రభుత్వ రంగాలలో కూడా "దీన్" ఆదేశాలనే అమలుపరచాలి. మనో వాక్కర్మలతో ప్రపంచం ముందు దాని గురించి నిజమైన సాక్ష్యం ఇవ్వాలి. ఈ సాక్ష్యం ఇచ్చే విధిని మనం విస్మరిస్తే మన ఉనికి పూర్తిగా అర్థరహితమై పోతుందనే విషయాన్ని బాగా గ్రహించాలి. ఈ విధిని గ్రహించటం వల్ల మనపై పడే బాధ్యత ఏమిటంటే మన సమస్త అభిరుచులు, ప్రయత్నాలు, ఆలోచనలు, అన్నిటికీ కేంద్రం ఈ సత్యానికి సాక్ష్యం (షహాదతె హఖ్) ఇవ్వటం కావాలి. ఇదే వీటన్నింటికి సార్థకతనిస్తుంది. ఈ లక్ష్యానికి భిన్నంగా ఉండే ప్రపంచం ఎదుట ఇస్లాంను గురించి తప్పుగా ప్రకటించే ప్రతి పనికి మనం దూరంగా ఉండాలి.

☆ ☆ ☆

5. ఇఖామతే దీన్

(ధర్మసంస్థాపన)

అల్లాహ్ పంపిన ప్రవక్తలందరూ మానవుల్ని కేవలం అల్లాహ్ దాస్యం వైపునకే ఆహ్వానిస్తూ ఇతర దాస్యాలన్నింటి నుండి వారిని విముక్తులు చేశారన్న విషయం మీకు తెలిసిందే.

"కేవలం అల్లాహ్ దాస్యాన్నే చేయండి. ఆయనకు తప్ప మరెవ్వరికీ దాస్యం చెయ్యకండి." ("అని ప్రవక్తలు పలికారు")

(హూద్ : 2-26, హామీమ్ సజ్దః 14, అల్ కహఫ్ : 21)

శాసనాధికారి, పాలకుడు కేవలం అల్లాహ్ మాత్రమే. శాసించే అధికారం ఆయనకు తప్ప మరెవ్వరికీ లేదు. మానవులతో సహా విశ్వమంతటికీ ఆయనే సృష్టికర్త. అందువల్ల ఆయనే అందరికీ యజమాని, శాసనాధికారి కూడా.

"అల్లాహ్ మాత్రమే ఆకాశాల్లో ఉన్న వాటికి, ధరణిపై ఉన్న వాటికి ప్రభువు." *(బఖర-284)*

"సృష్టించడం ఆయనకే చెల్లుతుంది. (అంటే ఆయనే ఈ విశ్వాన్ని, మానవులను సృష్టించాడు) మరియు శాసనాధికారము కూడా ఆయనదే." *(ఆరాఫ్-54)*

ఇంకా, పూజలకు ఆరాధనలకు అల్లాహ్ మాత్రమే అర్హుడయినట్లు విధేయతకు దాస్యానికి కూడా ఆయనే అర్హుడు అని తెలిపారు.

"మీ ప్రభువు తరపు నుండి అవతరించిన ధర్మాన్ని అనుసరించండి ఆయన్ని కాదని మరొకరిని మీరు దైవంగా భావించి అనుసరించకండి."

(ఆరాఫ్-3)

అల్లాహ్‌నే ప్రభువుగా స్వీకరించడంలో కల అర్థం ఏమిటంటే, ఆయన చేసిన శాసనాన్నే సరయిన శాసనంగా అంగీకరించాలి, దాన్నే అనుసరించాలి. అల్లాహ్ తరపు నుండి రాని మరియు ఆయన శాసనానికి కట్టుబడని ప్రతి శాసనాన్ని సరయినదని భావించరాదు, అటువంటి చట్టాన్ని సరయినదని నమ్మి దాన్ని అనుసరించినట్లయితే, అది "షిర్క్" (దైవత్వంలో సాటి కల్పించడం)తో సమానమౌతుంది. అట్టి శాసన నిర్మాతను దైవమని భావించినట్లవుతుంది. అల్లాహ్‌కు సమ్మతమైన 'దీన్' అనుసరించడం అంటే పూర్తి మానవ జీవితం దైవాజ్ఞలకు లోబడి ఉండడం, జీవితంలో ఏ ఒక భాగమైనా దైవేతరుల విధేయతలో గడపక పోవడం.

ఓ ప్రవక్తా! వారితో చెప్పండి. నిస్సందేహంగా నా ప్రభువు నాకు ఋజు మార్గాన్ని ఉపదేశించాడు. అంటే సుస్థిరమయిన ధర్మం, ఏకాగ్ర చిత్తుడైన ఇబ్రాహీం (అలై) అనుసరించిన మార్గం. ఆయనకు 'షిర్క్' (దైవంతో సాటి కల్పించడం)తో ఎలాంటి సంబంధము లేదు. "ఇంకా ఇలా తెల పండి, నిస్సందేహంగా, నా నమాజు, నా ఖుర్బానీ, నా జీవన్మరణాలు, సర్వలోక ప్రభువైన అల్లాహ్‌కే. ఆయనకు సాటి ఎవ్వరూ లేరు. ఈ విధంగా (విశ్వాసము కలిగి ఉండటానికే) నాకు ఆదేశం లభించింది. మరియు నేను అందరికంటే ముందుగా ముస్లిం (విధేయుడు) అవుతున్నాను. (అన్ ఆమ్- *161,162*)

వాస్తవమేమంటే అల్లాహ్ అవతరింపజేసిన 'దీన్' (ధర్మం) ఇస్లాం, మానవ జీవితం మొత్తాన్ని ఆవరించి ఉంది.

"(మానవులకోసం) అల్లాహ్‌కు సమ్మతమైన ధర్మం కేవలం ఇస్లాం మాత్రమే" (ఆలి ఇమ్రాన్-19)

"ఓ విశ్వాసులారా! అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తల విధేయతా పరిధిలో సంపూర్ణంగా ప్రవేశించండి". (బఖర-208)

జీవితపు అన్ని వ్యవహారాలు, అవి సామూహికమైనవైనా లేక వ్యక్తిగత మైనవైనా ఈ ధర్మం ద్వారానే పరిష్కరింపబడుతాయి. దైవం, ఆఖిరత్ (పరలోకం), ప్రవక్తలు, దైవదూతలు, దైవ గ్రంథాలు మొదలగు విషయాల పట్ల మన నమ్మకాలు ఏమయి ఉండాలో మనకు ఈ ధర్మంద్వారానే తెలిసింది. ఇంకా, ఎవరిని ఆరాధించాలి? ఏ విధంగా ఆరాధించాలి? అన్న విషయం కూడా ఈ ధర్మం ద్వారానే మనకు తెలిసింది. మనిషికి దైవంతో ఉండవలసిన సరయిన సంబంధం ఏది? దాన్ని ఏ విధంగా స్థాపించుకోవాలి? మన నడవడిక ఎలా ఉండాలి? మనం జీవితాన్ని నైతిక నియమాల కనుగుణంగా ఎలా మలచుకోవాలి? ఈ విషయాలన్నీ మనకు ఈ ధర్మం ద్వారానే తెలిసాయి. ఇంకా మన పరస్పర సంబంధాలు ఎలా ఉండాలి? మానవులకు ఒకరిపై మరొకరికి ఉన్న హక్కులేవి? జీవితపు వివిధ రంగాలలో, వివిధవ్యక్తుల, వస్తువులపట్ల, మనిషిపై తారసిల్లే బాధ్యతలేవి? అనే విషయాలు కూడా తెలిసివచ్చాయి. వ్యాపారంలో, లావాదేవీల్లో, ఆర్థిక విషయాల్లోను ఈ ధర్మం సరయిన మార్గం చూపగలిగింది. సామాజిక విషయాలందు, దైనందిన వ్యవహారాలందు, రాజకీయాలందు కూడా ఈ ధర్మం మనకు మార్గం చూపుతుంది. సమాజ సంస్కరణకు, దేశంలో మంచి పాలనకు ప్రభుత్వం చెయ్యటానికి సవ్యమైన, న్యాయవంతమైన సూత్రాలేవో ఈ ధర్మం సూచించింది. మొత్తానికి జీవితంలోని వ్యక్తిగత సామూహిక వ్యవహారాలన్నిటిలో ఈ 'దీన్ (ధర్మం) చూపిన మార్గాన్ని అనుసరించి వ ఎనం ఇహలోకంలోను

విజయవంతంగా, ఉన్నతంగా మనగలుగుతాము. మరియు పరలోకంలోను శాశ్వత సాఫల్యం పొందగలుగుతాము.

దీన్(ధర్మం) యొక్క విశాల భావనను మీరు విస్మరించకపోతే మరొక సత్యాన్ని అవలీలగా గ్రహిస్తారు. ఇస్లాంను, అది కోరే విధంగా అనుసరించాలంటే మనిషి తన వ్యక్తిత్వాన్ని పవిత్రం చేసుకోవడం సమాజాన్ని సంస్కరించుకోవడం ఎంతగా అవసరమో, ప్రభుత్వాన్ని సంస్కరించడం, అసత్య ధర్మాల వినాశకర జీవిత విధానాల స్థానంలో దైవ ధర్మానికి ఆధిక్యత ఇవ్వటం కూడా అంతే అవసరం. అలా కాకపోతే జీవితంలో ఒక పెద్ద భాగం తప్పుడు చట్టాల పాలై పోతుంది మరియు మనం జీవితంలోని కొద్ది భాగంలోనే అల్లాహ దాస్యం చెయ్యడం, ఆయన ధర్మాన్ని పాటించడం జరుగుతుంది. అది కూడా అధికారంలో ఉన్న ప్రభుత్వ వ్యవస్థ ఏ మేరకు ఏ కాలం వరకు అనుమతి ఇస్తుందో అంతవరకే సాధ్యపడుతుంది. ఈ కారణం వల్లనే దేవుని చివరి ప్రవక్త ముహమ్మద్(సఅసం) కేవలం అల్లాహ సందేశాన్ని ప్రజలకు అందజేయడానికే రాలేదు. ఆ ధర్మాన్ని ప్రపంచంలో ఉన్న సమస్త ధర్మాలపై మరియు సమస్త జీవన వ్యవస్థలపై ఆధిక్యతగలదిగా, ఔన్నత్యంకలదిగా చేయడానికే విచ్చేసారు.

> "సకల ధర్మాలపై ఆధిక్యతగల ధర్మంగా చేయడానికే అల్లాహ తన ప్రవక్తను హితోపదేశాలు, సత్య ధర్మాన్ని ప్రసాదించి పంపాడు. "ముష్రికీలకు (దైవానికి సాటి కల్పించేవారికి) ఈ పని ఎంత అయిష్టమైనా సరే!"
> (సఫ్-9)

అల్లాహ అంతిమ సందేశహరుని లక్ష్యమయిన ధర్మాన్ని ఆధిక్యత చేకూర్చే ఈ కార్యం కేవలం ఆయన ఒక్కరి ప్రయత్నంతో సాధ్యపడదు. సాధ్యపడాలంటే, సంఘటితమైన వ్యక్తుల సంఘం ఒకటి ఆయనకు తోడుగా ఉండటం ఎంతో అవసరం.

ఈ లక్ష్యసాధనకై తమ జీవితాలను, తమ సకల శక్తి సామర్థ్యాలను వినియోగించవలసి ఉంటుంది. అందువల్లనే దైవ ధర్మాన్ని అన్నిటిపై ఆధిక్యత గలదిగా చేసేటట్లు, భువిలో ఒకొక్క ప్రదేశాన భూమికి నిజప్రభువయిన అల్లాహ్ ఆజ్ఞలు, శాసనాలపై అమలు జరిగేటట్లు కృషి చేయడం ముస్లిం సమాజం లక్ష్యంగా నిర్ణయమయింది. దివ్య ఖుర్ఆన్ పై వాక్యాల తరువాతః

"ఓ విశ్వాసులారా! దుర్భర నరకబాధ నుండి విముక్తుల్ని చేసే వ్యాపారాన్ని మీకు చూపనా? (ఆ వ్యాపారం ఏమిటంటే) మీరు అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తను విశ్వసించండి. మరియు అల్లాహ్ మార్గాన మీ ధన, ప్రాణాలతో నిర్విరామంగా కృషి సలుపండి. మీరు బుద్ధికల వారయితే ఈ మాటే మీకు శ్రేయస్కరం. ఇట్టి స్థితిలో అల్లాహ్ మీ పాపాలను క్షమిస్తాడు. సెలయేర్లు ప్రవహించే స్వర్గంలో మిమ్మల్ని ప్రవేశింపజేస్తాడు; మరియు శాశ్వతమయిన స్వర్గంలో వైభవోపేతమయిన భవనాలలో మీరు చిరకాలం నివసిస్తారు. ఇదే మహత్తర విజయం. ఇంకా మీకు ప్రియతమమైన మరొక దాన్ని అంటే అల్లాహ్ తన సహాయాన్ని మరియు విజయాన్ని అతి సమీపకాలంలో ప్రసాదిస్తాడు, (ఓ ప్రవక్తా!) (విశ్వాసులకు శుభవార్త వినిపించు.)" (సఫ్ : *10-13*)

ఈ దివ్య వచనాల ద్వారా తెలిసిందేమంటే, ఇహపరాల పరాజయం నుండి, అల్లాహ్ విధించే వ్యధాభరితమైన శిక్షనుండి తప్పించుకోవాలంటే ఇహపరాల సాఫల్యం, అల్లాహ్ సహాయం, ఆయన అనుగ్రహం, క్షమాభిక్ష, స్వర్గం పొందాలంటే మార్గం ఒక్కటే. అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తను విశ్వసించి ఆయన మార్గంలో నిర్విరామంగా కృషి చేయాలి. అల్లాహ్ మార్గంలో కృషి చేయాలంటే మనిషి చిత్తశుద్ధితో, ఏకాగ్రతతో, అల్లాహ్ అనుగ్రహించిన (దీన్)

ధర్మాన్ని అనుసరించడంలో దాని సందేశ ప్రచారంలో మరియు దాని ఆధిక్యతను స్థాపించే ఉద్యమంలో నిమగ్నం కావాలి. ఈ ధ్యేయానికై తన శక్తి సామర్థ్యాలను తన వద్ద ఉన్న సాధనాలను ఒనరులను వినియోగించాలి.

అల్లాహ్ ప్రసాదించిన ధర్మాన్ని అనుసరించడం, దాని సందేశం ప్రచారం చేయడం, దానికి అన్నిటిపై ఆధిక్యత కలిగేలా సలిపే కృషిని "ఇఖామతే దీన్" (ధర్మసంస్థాపన) అని అంటాము. ప్రతి యుగంలో ప్రపంచంలో సత్య ధర్మ అవతరణకు లక్ష్యం ఈ సంస్థాపనమే అని పవిత్ర ఖుర్ఆన్ తెలుపుతుంది. దైవ ప్రవక్తలందరు ఈ ఒక్క లక్ష్యసాధనకే ప్రపంచంలో ప్రభవించారు. విశ్వాసులందరికీ ఈ లక్ష్యాన్ని సాధించేందుకు సమైక్యభావంతో కృషి చేయాలనీ అనైక్యతకు, అభిప్రాయభేదాలకు లోను కారాదని ఆదేశించబడింది.

ఏ ధర్మాన్నయితే స్థాపించాలని, భేదాభిప్రాయానికి లోనవకుండా ఉండాలని మేము నూహ్ (అలై)కు బోధించామో, మరియు దేన్నయితే మేము (ఓ ముహమ్మద్!) మీపై అవతరింపజేశామో, ఇంకా దేన్నయితే మేము ఇబ్రాహీం (అబ్రహం), మూసా (మోషే), ఈసా (ఏసు), (అలై) లకు ఉపదేశించామో ఆ ధర్మాన్నే మేము మీ ధర్మంగా నిర్ణయించాము.

వాస్తవానికి ముస్లిం సమాజం ఏర్పడడంలోని ఉద్దేశ్యం ఒక్కటే. వారంతా ఐక్యతతో ఏకాభిప్రాయంతో అల్లాహ్ ప్రసాదించిన ధర్మాన్ని అనుసరించాలి. దాని సందేశ ప్రచారానికి దానికి అన్నిటిపై ఆధిక్యత గలిగే కృషి చేయడానికి, అంటే "ఇఖామతె దీన్, (ధర్మసంస్థాపన)కు అంకితం కావాలి. అదే వారి జీవితపరమార్థంగా, ధ్యేయంగా రూపొందాలి. ఈ ధ్యేయాన్ని సాధించడానికే వారు తమ శక్తి సామర్థ్యాలన్నింటినీ వినియోగించాలి. ధర్మసంస్థాపనే తమ

లక్ష్యంగా చేసుకోనంతవరకు మరియు సమైక్యతతో, ఏకాభిప్రాయంతో ఈ లక్ష్యసిద్ధికై కృషి చేయనంత వరకు ముస్లిం సమాజపు సమస్యలు అపరిష్కృతంగానే ఉండిపోతాయి. వారు ఇహపరములందు అసఫలతను చవిచూడవలసి ఉంటుంది. అప్పుడు వారు మానవాళిని నిరాశానిస్పృహల నుండి, అసఫలత నుండి రక్షించ లేరు. పరలోకాన అల్లాహ్ సన్నిధిలో ఆదరణ పొందలేరు. పైపెచ్చుగా ముస్లి ములని చాటుకున్నప్పటికీ, ఇస్లాం అనుసరణ, దాని సందేశ ప్రచారం, దాని సంస్థాపన కొరకు శక్తి మేరకు పాటుపడలేదనే అభియోగం మూలంగా పట్టుబడతారు.

ఇఖామతె దీన్- ధర్మసంస్థాపనా కార్యం విజయవంతమవడానికి ప్రతి ముస్లిం తనయావత్తు జీవితంలో అల్లాహ్ అవతరింపజేసిన ధర్మాన్ని అనుసరిం చాలి. ప్రజలంతా తమ ఐహిక సఫలత, పరలోక ముక్తి మోక్షాలు అల్లాహ్ అనుగ్రహించిన ఈ ధర్మాన్ని స్వీకరించి దాన్ని పాటించడంలోనే ఉన్నాయని గ్రహించగలిగేంతవరకు, ఇంకా, ప్రభుత్వ పాలనావ్యవస్థ సమేతంగా జీవితపు వ్యవస్థ అంతా అల్లాహ్ ధర్మానికనుగుణంగా ఉండాలని వారు నిర్ణయించుకునే వరకు ముస్లింలందరూ వ్యక్తిగతంగా, సామూహికంగా అల్లాహ్ ప్రసాదించిన ఈ ధర్మాన్ని దాని సందేశాన్ని సకల మానవాళికి అందజేయాలి. అప్పుడే ధర్మ సంస్థాపన కార్యం సాధ్యపడుతుంది.

☆ ☆ ☆

6.జమాఅతె ఇస్లామీ హింద్

అల్లాహ్ ప్రసాదించిన ధర్మానికి నిజమైన సాక్ష్యం ఇవ్వడం, దాన్ని సంపూర్ణంగా స్థాపించడం మాత్రమే ప్రతి ముస్లిం మరియు ముస్లిం సమాజం యొక్క లక్ష్యం అని గత పేజీల్లో విశదీకరించబడినది. కాని సాధారణంగా ముస్లింలు తమ ధ్యేయాన్ని విస్మరించి, తప్పుడు లక్ష్యాలకు, కార్యాలకు అంకితమయిపోవడం, పర్యవసానంగా వారు తమ ప్రాపంచిక జీవితాన్ని నాశనం చేసుకోవడమే కాక తమ పరలోక జీవితాన్ని కూడా పాడుచేసుకోవడం ఎంతో శోచనీయం.

జమాఅతె ఇస్లామీ వాస్తవానికి ముస్లిం సమాజం విస్మరించిన ఈ విద్యుక్త ధర్మాన్ని జ్ఞాపకం చేస్తోంది. దేవుని దాసులైన ఇతర మానవులకు ఈ లక్ష్యం వైపునకు ఆహ్వానించడానికే ఏర్పడింది. అల్లాహ్ అవతరింపజేసిన ధర్మ సంస్థాపన దీని ధ్యేయమని, ఈ ధ్యేయమే ముస్లింల నిజమయిన ధ్యేయమని, అందువల్ల వారు అన్నింటినీ విడనాడి ఈ ఒక్క లక్ష్యం కొరకే ఏకాగ్రచిత్తులవ్వాలని జమాఅత్ జ్ఞాపకం చేస్తుంది. ముస్లిమేతరులనుద్దేశించి వారి ఐహికసఫలత, పరలోకమోక్షం, అల్లాహ్ పంపిన సత్య ధర్మం, ఇస్లాంపైనే ఆధారపడిఉన్నాయి. అందుకే వారు ఇస్లాం సందేశాన్ని గురించి సావధానంగా ఆలోచించాలని, నిష్పాక్షికమైన బుద్ధితో, విశాల హృదయంతో దానిసత్యాన్ని పరిశీలించాలని వారికి తెలియజేస్తోంది.

జమాఅతె ఇస్లామీకి ఒక నిబంధనావళి (Constitution) ఉంది. ఈ

నిబంధనావళికి కట్టుబడే సకల కార్యాకలాపాలు జరుగుతాయి. ఈ నిబంధనావళిని 'జమాఅత్' సభ్యులెన్నుకున్న ప్రతినిధులు ఆమోదించారు. దీనిలో జమాఅత్ ధ్యేయం వివరణ ఇలా వుంది.

'జమాఅతె' ఇస్లామీ ధ్యేయం 'ఇఖామతే దీన్' (ధర్మ సంస్థాపన). దీని అసలు ప్రేరణ దైవప్రసన్నత, పరలోకమోక్షం పొందడం.

వివరణః 'ఇఖామతె దీన్' లోని పదం 'దీన్' అంటే ఏ సత్యధర్మాన్నయితే విశ్వప్రభువైన అల్లాహ్ తన ప్రవక్తలందరి ద్వారా వివిధ కాలాల్లో వివిధ దేశాల్లో అవతరింపజేశాడో, దేన్ని చివరిసారిగా సంపూర్ణ రూపంలో సకల మానవాళికి ఉపదేశించడానికి తన అంతిమ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సఅసం)పై అవతరింపచేశాడో, మరియు ఏది ఈనాడు ప్రపంచంలో ప్రామాణికమయినదో, సురక్షితంగా ఉన్నదో, మరియు ఏది అల్లాహ్‌కు ఆమోదయోగ్యమో, ఇస్లాం అని దేనికి పేరో ఆ ధర్మం అని అర్థం.

ఈ దీన్ మానవుడి అంతర్బాహ్యాలను, అతని జీవితపు వ్యక్తిగత, సామూహికరంగాలను పరివేష్టించి ఉంది. విశ్వాసాలు, ఆరాధనలు, నైతిక ప్రవర్తనలు మొదలుకొని ఆర్థిక, సాంఘిక, రాజకీయ విషయాలవరకు మానవ జీవితంలోని ఏ ఒక్క విభాగం కూడా దాని పరిధికి దూరంగాలేదు. ఏ విధంగా ఈ దీన్ (ధర్మం) దైవప్రసన్నతని, పరలోకమోక్షాల హామీనిస్తుందో, అదే విధంగా ఇది ప్రాపంచిక సమస్యలసముచితమైన పరిష్కారం కొరకు అత్యుత్తమమైన జీవిత విధానం కూడా. ఇంకా వ్యక్తిగత జీవితమైనా, సామూహిక జీవితమైనాసరే, కేవలం దాని సంస్థాపన ద్వారానే సాధ్యపడుతుంది. 'ధర్మ సంస్థాపన' అంటే ఎలాంటి విచక్షణ విభజనలులేకుండా పరిపూర్ణ ధర్మాన్ని చిత్తశుద్ధితో

అనుసరించాలి. అన్నిటిని విడనాడి ఏకాగ్రతతో అనుసరించాలి. మానవ జీవితపు వ్యక్తిగత, సామూహిక రంగాలన్నింటిలో దీనిని అమలు పరచాలి. తద్వారా మనిషి పరిణామ ప్రగతులు, సమాజ నిర్మాణం, రాజ్య రూపకల్పన అంతా ఈ దీన్ ధర్మాని కనుగుణంగా రూపొందాలి.

ఈ ధర్మ సంస్థాపనకు ఆదర్శప్రాయమయిన అత్యుత్తమమయిన ఆచరణాత్మకమయినరూపం, మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) మరియు సన్మార్గగాములైన ఖలీఫాలు (రఅ) స్థాపించినదే.

(జ.ఇ.హి. నిబంధనావళి 4వ అధికరణం (ధ్యేయం)

కార్యాచరణ విధానం

ఈ ధ్యేయాన్ని సాధించడానికి జమాఅతె ఇస్లామీ హింద్ అవలంబించే విధానం ఏమంటే సిద్ధాంతప్రచారం, బోధనామార్గం బలాత్కారం, హింసా పద్ధతి కాదు. ఈ విషయం జమాఅత్ నిబంధనావళిలో దాని కార్యాచరణ విధానం తెలిపే క్లాజులో ఈ విధంగా వ్యక్తం చేయబడింది.

1. ఖుర్‌ఆన్ సున్నత్‌లు జమాఅత్ కార్యకలాపాలకు మూలాధారంగా ఉంటాయి. మిగతా అన్ని విషయాలు ఆ తరువాత స్థాయిలో ఖుర్‌ఆన్ మరియు సున్నత్ ప్రకారం వాటిని వీలున్నంత మేరకే దృష్టిలో ఉంచుకో బడతాయి.

2. జమాఅత్ అన్ని వ్యవహారాల్లో నైతికపరిమితులకు కట్టుబడి ఉంటుంది. సత్యానికి, నిజాయితీకి వ్యతిరేకమైన పద్ధతులను, కులతత్వ విద్వేషాలను, వర్గసంఘర్షణలను భువిలో కల్లోలాన్ని రేకెత్తించే మార్గాలను కాని జమాఅత్ ఎన్నటికీ అవలంబించదు.

3. జమాఅత్ తన ధ్యేయాన్ని సాధించేందుకు నిర్మాణాత్మకమైన, శాంతియుత విధానాలనే అవలంబిస్తుంది. అంటే ప్రచారం, బోధ, సిద్ధాంత ప్రచారం ద్వారా మనిషి మనస్సును, స్వభావస్వరూపాల్ని సంస్కరిస్తుంది. ఈ విధంగా దేశ సామూహిక జీవితంలో అవసరమైన సత్పరిణామాన్ని తేవడానికి ప్రజాభిప్రాయాన్ని తీర్చిదిద్దుతుంది. (జ.ఇ.హిం. నిబంధనావళిః 5-1, 2,3)

జమాఅత్ సందేశం, ముస్లింలు, ముస్లిమేతరులు ఉభయులకు ఇవ్వబడుతోంది. జమాఅత్ కార్యకర్తలు వారిరువురికి దాని సందేశాన్ని అందజేస్తారు. జమాఅత్ దేశానికి మరియు మిల్లత్ (ముస్లిం సమాజం)కు సంబంధించిన ధార్మికంగా, నైతికంగా సవ్యమైన, లాభకరమైన పనులన్నిటిలో దాని శక్తి మేరకు పాల్గొంటుంది. తదనుగుణంగా కలహాలకు గురి అయిన వ్యక్తులకు సహాయం అందజేయడానికి దేశ వ్యాప్తంగా పని చేయడమే కాక, వరదలకు, కరువులకు, అగ్నిప్రమాదాలకు ఇంకా ఇతర ప్రమాదాలకు గురయినవారికి కుల మత విచక్షణ లేకుండా మనుషులందరికీ సేవచేస్తోంది. (వివరాలకు దేశం, ముస్లిం సమాజాల పునర్నిర్మాణం-జ.ఇ.హింద్ చదవండి)

జమాఅత్ తన ధ్యేయసిద్ధికై దీని సలహా సంఘం ద్వారా ప్రతి నాలుగేళ్ళకొకసారి ఒక కార్యక్రమం నిర్ణయించుకుంటుంది. దాన్ని చదివితే జమాఅత్ నడుస్తున్న నాలుగేళ్ళ కాలంలో చేయదలచిన కార్యాల సంగ్రహ రూపం కానవస్తుంది. ప్రతి వ్యక్తి, తాను ఈ కార్యసిద్ధికై జమాఅత్‌కు ఎంత వరకు తోడ్పడగలడో తన్ను తాను ప్రశ్నించుకొని నిర్ణయించుకోవాలి.

సమాప్తం